सत्यमेव जयते

# స్వాతంత్ర్య స్వరము

సంపాదకులు :

డా|| రాజేష్ కుమార్ పర్తి

రాష్ట్రీయ అభిలేఖాగార్,

న్యూ ఢిల్లీ.

# స్వాతంత్ర్య స్వరము

సంపాదకులు :

డా॥ రాజేష్ కుమార్ పర్తి

రాష్ట్రీయ అభిలేఖాగార్,

న్యూ ఢిల్లీ.

# ప్రస్థావన

రాష్ట్రీయ అఖిలేఖాగార్, మన భారతదేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వము బ్రిటిషు ప్రభుత్వము వారిచే ప్రతిబంధితమై బహు కాలంగా మరుగుపడియున్న దేశభక్తి గీతాలను, కవితలను ప్రచురించే బృహత్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ దేశభక్తి సాహిత్యము ఆ నాటి కోట్ల కొలది ప్రజానీకపు హృదయాలను ఎలా స్పందింపచేసి వారిని దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొనేటందుకు ప్రోత్సహించిందో అదే విధమైన ఉత్సుకము ఈ తరం ప్రజలలో రావాలని, వారు ప్రభావితులు కావాలని సంకల్పించింది. ఈ ప్రణాళిక అమలు జరిగాక వెలుగులోనికి వచ్చిన కొన్ని గ్రంథాలు "దేశభక్తి కె గీత్", "ఆజాదీ కె తరానె", "ధర్తీ కె పుకార్". పైని ఉదహరించిన విధంగా హిందీ, ఉర్దూ భాషలలో కొద్ది కాలము క్రితం వెలువడిన గ్రంథాలకు వచ్చిన ప్రోత్సాహాన్ని పురస్కరించుకొని, తెలుగు భాషలో అప్పటి బ్రిటిషు ప్రభుత్వముచే నిషేధింపబడిన కొన్ని దేశభక్తి గీతాలలో శ్రేష్ఠమైన వాటిని యెంచి కూర్చిన ఈ సంకలనమును మీకు అందజేస్తున్నాము.

ఈ దేశభక్తి సాహిత్యము ఒకసారి ప్రజలలో వ్యాప్తి చెందిన తరువాత, వయస్సు తారతమ్యం లేక అన్ని ప్రాంతాల వారిలో జాతీయతా కాంక్ష వెల్లివిరుస్తుందని బ్రిటిషు పాలకులకు తెలుసు. అదే సమయాన, ప్రస్తుతపు ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రభాత ఫేరిలలో, బహిరంగ సభలలో, ఇంకా యితర సామాజిక కార్యక్రమాలలోను ఈ దేశ భక్తి గీతాలను గానము చేసేవారు. గాయకులు ఈ గీతాలను మహారాణి ఝాన్సి, భగత్ సింగు వంటి మహనీయుల ధైర్య సాహసాలు, దేశము కొరకు వారు చేసిన త్యాగాలు, చివరకు వారి ఆత్మార్పణ, వేనోళ్ళ వక్కాణిస్తూ గానము చేసేవారు. లోకమాన్య బాలగంగాధర తిలకు, మహాత్మా గాంధి, అల్లూరి సీతారామరాజు, పండిత జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్ర బోసు ఇంకా ఇతర నాయకులు బ్రిటిషు ప్రభుత్వమునకు వ్యతిరేకముగా, నిర్విరామంగా జరిపిన పోరాటము ఈ దేశభక్తి గీతాలలో వివరించబడి గానము చేయబడ్డాయి.

ఎప్పుడైతే బ్రిటిషు ప్రభుత్వము ఈ దేశభక్తి సాహిత్యము బహుళ జనాదరణ పొంది తమ మనుగడకే ముప్పుగా పరిణమించిందని గ్రహించిందో, ఈ గీతాలున్న

పుస్తకాలన్నిటిని స్వాధీనము చేసికొని, నాశనం చేసింది. పరాయి ప్రభుత్వముచే నెలకొల్పబడ్డ కృత్రిమ అవరోధాలను, విభేధాలను ఆ నాటి తెలుగు వారు అధిగమించి, స్వాతంత్ర్య సమరంలో వారు చేసిన త్యాగాలు తెలిపేటందుకు కొన్ని ప్రతులు మాత్రం మిగిలాయి.

తెలుగు భాషలోని ఈ దేశభక్తి గీతాల సంకలనము స్మృతులుగా మిగిలిన ఆ నాటి తెలుగువారి వీరోచిత గాథలు, ఇతర ప్రాంతాల వారితో కలసి వారు స్వాతంత్ర్య సమరంలో నిర్వహించిన పాత్ర, వారి త్యాగాలు తిరిగి జ్ఞాపకానికి తీసుకొని రాగలదని ఆశిస్తున్నాము

డా॥ రాజేష్ కుమార్ పర్తి
(Dr. R.K. Perti)
అఖిలేఖ్ మహా నిదేశక్
భారత ప్రభుత్వము.

తేది : 8-4-1992
రాష్ట్రీయ అఖిలేఖాగార్,
న్యూ ఢిల్లీ, 1993

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | శీర్షిక | పుట |
|---|---|---|
| ప్రథమ భాగము (గేయాలు) | | |
| 1. | మహారాణి ఝాన్సి | 1 |
| 2. | స్వరాజ్య జండా | 7 |
| 3. | అల్లూరి సీతారామరాజు పాట | 14 |
| 4. | భగత్సింగు | 16 |
| 5. | స్వరాజ్య గీతామృతం-భారతమాత గీతము | 18 |
| 6. | నవయుగము-గాంధీ విజయము | 32 |
| ద్వితీయ భాగము (పద్యములు) | | |
| 7. | స్వరాజ్య మహాసభ | 36 |
| 8. | స్వతంత్ర గర్జన | 42 |
| 9. | పూర్ణ స్వాతంత్ర్యము | 50 |
| 10. | స్వరాజ్య గీతామృతము-స్తవరాజము | 52 |
| 11. | గాంధి మహాత్మ (కలియుగ ప్రహ్లాద) | 70 |
| 12. | మహాత్మా గాంధి | 74 |

# దేశభక్తి గేయాలు

## (ప్రథమ భాగము)

# 1. మహారాణి ఝాన్సి

స్వాతంత్ర్య విజయ వాంఛా దీప్తితోత్సాహ
సమరంబు సల్పిన ఝాన్సీ మహారాణి
చారిత్రమున్ విందుము అకలంక
సాహసంబేమందుము

సకల ప్రపంచక
స్వాతంత్ర్య చారిత్ర
సంపుటంబులలోని
స్వర్ణంబు పుటలలో
చిత్రింపబడె మణులతో ఝాన్సి చా
రిత్రంబు పనితనముతో

మహారాష్ట్ర దేశమున
మణి యొకటి జన్మించి
మహారాణియై వీర
మాతయని జగమందు
స్థిర కీర్తినిన్ జెందెరా ఝానిసీ
పరమ పావనురాలురా.

పసికూన తనయుండు
భర్తయున్ గతియింప
పదునెనిమిదవ యేట
వైధవ్యముం జెంది
రాజ్యంబు నేలిందిరా ఝానిసీ
పూజ్యతను గాంచిందిరా

పారతంత్ర్యంబను
పడమటి గాలికి
సుకుమార కుసుమంబు
శుష్కించి శుష్కించి
నేలపై రాలిందిరా । జీర్ణించి
నిశ్ఫలము జెందిందిందిరా.

ఆంగ్లేయ దౌర్జన్య
మానాటి కానాడె
అత్యాశతో దేశ
మాక్రమింపగ జొచ్చి
అన్యాయ మొనరించినన్ రాజన్యు
లాగ్రహంబున మించిరీ.

తూటాలు గోమాత
తోలుతో మాటించి
తోలు నోటితో పీక
తొందరల్ పుట్టించి
దోసంబు సల్పిరీ ఆంగ్లులు
మోసంబు గావించిరీ.

భారతావని నెత్తి
పై దాల్చు గోమాత
పరిభవింపగ జూచి
భరియింప గాలేక
భటని కాయంబు లెంతో కోపించి
పట్టు పట్టిరి రిపులతో.

సంకేత దినమున
సకల భారత భూమి
సమరంబు ప్రకటించి
స్వాతంత్ర్యమును జెంద
మంతనంబులు సల్పిరి ఒక రొకరు
సంతసంబున హెచ్చిరి.

ఆనాటి కానాడె
        అతిశయిల్లుచు లోన
అణిగి యుండిన శౌర్య
        మద్భుతంబుగనట్టె
అగ్గిపెట్టిన రీతిగా ఒకసారి
        భగ్గుమని మండిందిగా.

తరియింపగా గోరి
        తనయు నొక్కని దత్త
తను చేసుకొని నంత
        తగదంచు ఆంగ్లేయ
దౌర్జన్య మడ్డుపడగా ఝానిసీ
        గర్జించి ధ్వజమెత్తగా.

కపటియౌ డల్‌హౌసి
కబళింప రాజ్యంబు
బుసకొట్టి ఒకసారి
అసిదూసి ఝుళిపించి
వైరి వీరులలోను తా చెలరేగి
వన విహారము సల్పగా.

భారతాంబిక పాద
పద్మంబులకు మ్రొక్క
బావుటా పైకెత్తి
భండనంబున నిల్వ
పటహ కాహళ భాంకృతుల్ మార్మోగె
భద్రేభముల ఘీంకృతుల్

జయము నీకగుగాక
ఝాన్సీ మహారాణి
జయము భారతమాత
జయము గోమాతయని
జయ జయార్భటులతోను నిలబడె
సైన్యంబు సమరంబులోను.

సర్దారు తాంతియా
స్వాతంత్ర్య నానాజి
చిననాటి స్నేహితులు
చేరి సాయము రాగ
కొదమ సింగము రీతి తా అరులపై
కుప్పించి ఎగసిందిరా.

ముక్కంటి ఎదురైన
నుత్కటంపగ జాలు
చొక్కంబు చోదియై
జక్కాడ ఝానిసీ
అక్కడక్కడ దూరిరీ ఆంగ్లులు
దిక్కు దిక్కుల బారిరీ.

పరిపంథి రాజన్య
బలముల బంధించి
ప్రక్కలో బల్లెమై
భయ మొందగన్ జేసి
పదునైన చురుకత్తికిన్ ఝూనిసీ
బలిగాని నొక్కొక్కనిన్

స్వాతంత్ర్య మంత్రంబు
జపియించి ఝూనిసీ
సమరాగ్నిలో తనువు
సమిధగా నర్పించి
స్వారాజ్యమును బొందెను జన్మంబు
సాఫల్యమును గాంచెను.

మగపుట్టు వందైన
నగుపడని మగటిమి
జగమందు ప్రకటించి
పగతీర్చుకోబోయి
విగతాసు రాలాయెను ఝూనిసీ
వినుతి మిక్కిలి గాంచెను.

బంటుయై శౌర్యాగ్ని
మంటలను దాస్యంబు
నంటించగా బోయి
అంటుకొని భస్మయై
మింటి చుక్కలలోను తా నొక్కటై
మెరిసి చూచుచు నుండెరా.

కత్తిపోటున రిపుల
కుత్తుకల్ విదళించి
పచ్చి నెత్తురు త్రావి
పరవళ్ళు త్రొక్కిన
ఉత్తమ స్త్రీ ఝాసీసీ
అది నీకు క్రొత్త యౌనా మానిసీ.

ఆనాడె దేశంబు
అగచాట్ల పాలయ్యె
నని ఝాసీసీ రాణి
ఆత్మార్పణము జేసి
అమరత్వ ముం జెందెరా అది నీకు
అనుసరింపం జెల్లురా.

సకల భారత భూమి
స్వాతంత్ర్యమును జెంది
సంతసించిన నాడె
శాంతించు నా యాత్మ
అని ఝాన్సీ అనినట్లుగా చెవులలో
వినిపించు నశ్రాంతమున్

సర్వశ్రీ రావు, శివయోగానంద, కొ; రావు, వెంకట సుబ్బా, కొ;
సంపాదకులు: శ్రీమాన్ పండిత పి.యస్. ఆచార్య; ఏ. కేశవార్య శాస్త్రి
"౧౮౫౭ సం.పు. భారత స్వాతంత్ర్య ప్రథమ యుద్ధము"
-స్వరాజ్య ముద్రాక్షర శాల, బెజవాడ (౧౯౩౯).

రాష్ట్రీయ అఖిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం.
అవాప్తి సంఖ్య - **2749**, **2751**, న్యూ ఢిల్లీ.

## 2. స్వరాజ్య జండా

కీర్తన (ఆదితాళం)

ఎత్తండి స్వరాజ్య జండా
జండా నెత్తండి ధైర్యము నిండ - నింక
స్వరాజ్య జయమును - సంధింతుమనుచును ॥ (ఎ)

మూడు రంగుల జండ - ముద్దులొల్కె
డు జెండా - మనుకొని మనమున్న యుండ
దాని - విడచిన మనకేది యండ
వట్టి - యెండ మావుల చెంత నుండ
కుక్షి నిండునె నద్దాని నిండ
గాన తిండికి తలదాచి యుండుటకై
యింక ॥ (ఎ)

జాతి భేదము లెంచి । యైకమత్యము వీడి
నీతి బాహ్యత బొందకండి । శుష్క
వాదముతో నుండకండి । సంఘ
భేదముల నెంచకండి । గాంధి
యాదర్శముల నెంచి । యేకీ భావము గాంచి ॥ (ఎ)

మోదము జూపించి । మోసము కల్పించి
భేదించి పాలించు బుద్ధి । యల్ప
భేదము కల్పించు బుద్ధి । పశు
సాధన గైకొన్న బుద్ధి । సాధు
బాధలు కల్పించు బుద్ధి । దీని
సాధింపగా గాంధి । సత్యాగ్రహము నూనె ॥ (ఎ)

ఉప్పుపై పెనుదాడి । యొప్పుగ గావించి
విప్లవ మొనరించినాడు । గాంధి
కప్పాము లరికట్టినాడు । ఖద్ధ
రొప్పుగ కట్టు మన్నాడు । త్రాగు
డొప్పమి, మానుమన్నాడు । రాట్న
మెప్పుడు త్రిప్పుమన్నాడు । తాను
చెప్పిన చొప్పున । తప్పక మీరంత ॥ (ఎ)

నీ లాభమే జూచి । నీ సౌఖ్యమే । యెంచి ।
నీ యంత నే తిరుగ బోకు । లోక ।
నిందల పాలు గాబోకు । శీమ
నేత గుడ్డ యంటబోకు । వారి
చేతులలో డాగ బోకు । యల్ప
జాతుల దయజూచి । దరికి జేరదీసి ॥ (ఎ)

పదమూ డార్డర్లను । బలిమి ప్రయోగించి
పాలింప యెత్నించినారు । పశు
బలము ప్రయోగించినారు । లాఠి
పోలీసులను గూర్చినారు । సాధు
వీరుల బంధించినారు । వారి
సాధ్యము కాదాయె । శాంతము నెలకొల్ప ॥. (ఎ)

నూట నలుబది నాల్గు । సెక్ష నొక్కటి బెట్టి
లాఠీలతో గొట్టినారు । వారి
ధాటి యంతయు జూపినారు । బహు
మేటి సిపాయిలైనారు । తమ
మాటే లా ఆర్డరని । మరి శిక్ష జేశారు ॥ (ఎ)

గాంధి టోపీ జూచి ॥ కన్ను మిటకరించి
యంధ భూతము లైపోయారు । వహ్వా
బందిగముల నుంచినారు । మహా
యంధకారమున బడ్డారు । ధర్మ
మందము గల్పించినారు । ఔర
వందేమాతర మన్న । వారిని గొట్టారు ॥ (౨)

రండాగొండి జేసి । లారీ బస్సుల తోడ
జండాల దాడి జేశారు । బహు
దుండ గీడుల జేర్చినారు । సాధు
మండలి బాధించినారు । గ్రామ
జండాలన్నియు బీకినారు । బహు
మొండి తనము బూని । మొరటులై యున్నారు ॥ (౨)

లాలెస్సు పోలీసు । లాబైండు సిటిజనుల
లాఠీలతో మోదినారు । కాంగ్రెస్
అన్లాపుల్ కమిటీ యన్నారు, సాధు
లం దారి చఱబెట్టినారు । వారి
సందు గొందుల దాచినారు, వహ్వా
బందిగంబులు నింపి । బహుబాధ పడ్డారు ॥ (౨)

చల్లని మావాడ । పల్లి వెంకటేశు
కల్యాణ సమయమ్ము నందు । లారీ
పెల్లున మరి బస్సులందు, బహు
కల్లరి పోలీసులందు । మరి
యల్లరి గావించి యందు । పంచ
ముల్లార రండని । మూర్ఖత జూపిరి ॥ (౨)

లా ఆర్డరనుచును । లాణే భేణీ వేసి
లాఠీలతో తిరిగినారు । వట్టి
బూటకములు బన్నినారు । యుద్ధ
నాటకములు జూపినారు । జనుల
తూటాలతో గాల్చినారు । యంత
నిరాయుధుల బట్టి నెట్టిరి । కొట్టిరి ॥ (౨)

కాంగ్రెసు మనకున్న ఘనమైన దు
ర్గము - కనులను దెరచి చూడండి
దానికాదని విడనాడకండి - శుష్క
వాదాలు పనికిరావండి - జాతి
భేదాల నెంచబోకండి - కాంగ్రెస్
వాదులరై మసలుకొండి - గాంధి
యోధుడై మననెల్ల - నుద్ధరింపగ బూనె ॥ (౨)

అన్ని జాతుల వారి - కన్ని పార్టీల వారి
కున్నది కాంగ్రెసు గాదా - వారి
యెన్నికలకు చోటు లేదా - వారి
కున్న దర్జా యుండబోదా - వారి
కున్నది తిసియుండ రాదా - యింక
దుర్ణయ బుద్ధితో - తొలి పార్టీలనక ॥ (౨)

కఠిన శాసనముల పటిమ పరిపాలన
కఠినమని తెలుసుకొన్నారు । తమ
కుటిలతకు సిగ్గుపడ్డారు । సంఘ
పటిమ గ్రహించు కున్నారు । కాంగ్రెస్
సభ్యత కొప్పుకున్నారు । వారి
విపరీత శాసనాలు । వితుడ్రా చేసినారు ॥ (౨)

గాంధి యిర్వినుట్రూసు । క్రమముగ కల్పించి
సత్యాగ్రహుల విడచినారు । రాజ
చక్రాము యోచించినారు । దేశ
విక్రమము దెలుసుకున్నారు । యింక
చక్రంపు మీటింగు జేయంగ నున్నారు ॥ (౨)

కాంగ్రెస్సు భేదింప కడగి యిర్విను దొర
కడు ఘోర వధలు గావించె । యతి
కౄర స్వభావంబు గాంచె ॥ భగత్
సింగూను నురిదీయనెంచె ॥ దేశ
మంత క్షమింప ఘోషించె । గాని
దొరతనము దాని శాసించె । నంత
శుక దేవాదులతోనిసీ । చంపివేశారు ॥ (౨)

గాంధి మహాత్ముని । ఘనశాంత సత్యము
కాంగ్రెస్సునకు ఖ్యాతి దెచ్చె । వారి
భాష యందరికిని నచ్చె । పెర
వేషాలు శాంతింప జొచ్చె । స్వల్ప
దోషాలన్నియు ద్రోసిపుచ్చె ॥ గొప్ప
కాంగ్రెస్ సేనానియై కలుషములడగించె ॥ (౨)

సర్దార్ వల్లభాయి । ప్రసిడెంటు పటేలు
బిరుదు గుప్తా బోసులుండ । సరి
హద్దూ గాంధి యొక్కడుండ । గొప్ప
బిరుదు జవహరి లాలుడుండ । మన
దేశబంధుడు సాంబులుండ । డాక్టర్
సుబ్రహ్మణ్యం బాది సద్భక్తులతో గూడి ॥ (౨)

శీమ గుడ్డంగళ్ళ జేరి శాంతముతోడ
పికెటింగు సాగించు స్త్రీలు । సహజ
సుకుమారతను వీడు స్త్రీలు ।। దేహ
యభిమానమును మాను స్త్రీలు ।। దీక్ష
పనిబూని వర్తించు స్త్రీలు । మంచి
వినయము జూపిన స్త్రీలు ।। బహు
విజ్ఞానమును గాంచి ।। వీధికేతెంచిరి ।। (౨)

మాళవ్యా గారొక్కమాటు పారను క్లాతు
బాయి కాటును చేశినారు - మిల్లు
లన్నిటి బాస గొన్నారు - శీమ
మిల్లుకు సీలు జేశారు - వారి
యుల్లాసములు దీసినారు - తమ
తల్లి భారతముద్ర - దానికి జేర్చారు ।। (౨)

శాంతితో పికెటింగు - సాగించు చున్నట్టి
యింతుల గనుగొన్న సిగ్గు - వారి
శాంత స్వభావమునకు సిగ్గు - వారి
యాత్మ త్యాగమునకు సిగ్గు - వారి
యైక మత్యమునకు సిగ్గు - వారి
యా ద్రుస్యమునకు సిగ్గై - మ్రగ్గిపోకుండగ ।। (౨)

ప్రియమైన పాలన - క్రమముగ కల్పింప
గాంధీయ బ్రహ్మాంబుగాను ఉప్పుసాంద్రమె
క్షీరాబ్ధిగాను - యుద్ధసాధన సత్యాగ్రహముగాను
వారుజేసే యాందోళనకు గాను -వారి శాంతముగా
సాధింప సరియైన యోధుల్లరై. ।। (౨)

మాత భారత దాస్య । మపన యింపను । బూని
మనవారు కృషి సల్పుచుండ । దాని
వినిచూచి మన మూరకుండ । ధర్మమని
తోచెనే మనసు నిండ ॥ లోక
మున తిట్లు మనకు రాకుండ । నేడే
ఖద్దరు ధారీగ । గానుందు మనుచును ॥ (౨)

కూడూ గుడ్డలు మనకు । కోరిన వుండంగ
కూళ వస్తువు లంటనేల । కరువు
కోరి తెచ్చుకొనగ నేల । బంధు
వైరము మనకుండనేల । జ్ఞాన
విశ్వము విడనాడనేల । యడి
యాసలతో కొంపదీసి కోకుండంగ ॥ (౨)

ఒకరితో సంబంధ । మొప్పమి మనకేల
యొరుల వేషము దాల్పనేల ॥ వారి
మరబట్ట మన మంటనేల - గొప్ప
కరువుకు చోటివ్వనేల - దుష్ట
తెరగుల చెరియింపనేల - దీని
మరచి మీరందరు - మరి నిద్ర జెందక ॥ (౨)

సీతారామ్, ఆచార్య, శృంగవరపు; "స్వరాజ్య జండా"
కొండపల్లి వీర వెంకయ్య (శ్రీ సత్యనారాయణ బుక్ డిపో), రాజమండ్రి.
రాష్ట్రీయ అభిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం,
అవాప్తి సంఖ్య-2774, న్యూ ఢిల్లీ.

# 3. సీతారామరాజు పాట

(మాకొద్దు తెల్లదొరతనము - అను మాదిరి)

అల్లూరి సీతారామరాజ-ఈ భరతా ఖండము యొక్క
బానిసత్వము బాపె ॥ (అ)

నరసాపురములోన తుని పట్టణంబూన కొలది కాలము నుండి
నావు-భోజన మొంటీ పూటా చేసినావు-వేపాకును తినగా
కోరినావు-రాజ కృష్ణాదేవీ పేటకేగి కాపురమున్న ॥ (అ)

శరభా శార్దూలాది జంతుమూకలు నిన్ను చూచినంతనె దొల
గి పోవు-కోడె(త్రాచులు స్వాగతమొసగిపోవు-దుష్ట
(గ్రహములు దరికి చేరరావు-ఆ వాలూ కన్నుల జాణలదరీ
(మొక్కూలిడరె ॥ (అ)

నిండూ చందురుబోలు నీమోము యందంబు మేనూబంగరు
ఛాయా రాజా-నీ వయాసూ యిరువదైదు రాజా-నీ శౌర్యా
మనివార్యంబు రాజా-ఆ కోయాదొరలాకెల్ల దైవామీవే రాజా॥ (అ)

(ప్రతి పట్టణంబూన పంచాయితీ కోర్టు పెట్టించినావనీ దొరలు
నిన్ను కొట్టూలో బెట్టీరి వారలు । ఆరు వారములె యుంచిరీ
హూణులు ॥ నీ పైనా సాక్ష్యము లేక నిలుపూ
చేసిరి కేసు ॥ (అ)

కోర్టూ దొరను చూచి కోరా మీసము (దిప్పి దోసామెంచక ప
ట్టి నారా కోడె(త్రాచూ నిదురా లేపినారా-గండుసింగము
తొ సయ్యాట లౌరా-అహ యనుచూ జేరినావు
అడవిదొరలతోడ ॥ (అ)

గాముా మల్లూ దొర గా మూగంటం దొర సేనాధిపతులైరి రేడా
మూడునూర్ల కోయాదళము తోడ-దేవా విల్లునమ్ములు
పట్టిప్రోడ-ఆరు పోలీసు స్టేషనులు ఆక్రమించినవాడ ॥ (అ)

మైలూ దూరామున్నా వేలా ప్రజలూ యున్న వైరీ కోటిని జూ
తు నీవు-సూటిగానూ వూచా వేసెదావు ఏ దిక్కు చూచి
గాన రావు-నీ వింటీ పోటుల చూచి తుంటారన్నారయ్య ॥ (అ)

ఘోరాటడవిలోని కోయదొరల గూల్చ యోధులగొని తె
చ్చినారు-నీళ్ళుత్రాగి కొండా ర రచినారు-శీత జ్వరమూ
లచే సొక్కినారు-ఆ మలబారు సైనికూలు
మటుమాయమయ్యె రాజా ॥ (అ)

నిన్ను గాంచిన తోడ నెట్టి శత్రూవైన నవ్వూచు నమస్కార
మిడును । నోటిమాటైన లేకుండ జూచును ।
శ్రీరాముడనీ నిన్ను
పూజించును । నీ మహిమాలెన్నా తరమయాది శేషువుకైన॥ (అ)

కలదూ భారతఖండ మందూ విఖ్యాతిగన్న పురమూ శే
కూ రాకటి రాజా । భాగ్య భోగ్యములకూ మిన్న రాజా । కవు
లచేత వన్నే గాంచె రాజా । రాజ కలియుగార్జున కృష్ణరాయా
రచీయించె ॥ (అ)

"శేకూరు" ఇది గుంటూరు మండలము లోనిది.
రాజ కలియుగార్జున కృష్ణరాయ; "సీతారామరాజు పాట"
కొండపల్లి వీర వెంకయ్య (శ్రీ సత్యనారాయణ బుక్ డిపో) రాజమండ్రి.
రాష్ట్రీయ అఖిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం,
అవాప్తి సంఖ్య-2774, న్యూ ఢిల్లీ.

# 4. భగత్సింగు

ఒక తారక మేల్కాంచెను;
    ఒక వీరుడు కను విచ్చెను.
ఒక మెళుకువ !
    ఒక్క వెలుగు !!

*    *    *

ఆ తారను పీక నులిమి
    చంపిందేదో చీకటి !
ఆ వీరుని పీక నులిమి
    చంపిందేదో పిశాచి !!

*    *    *

కోటి కోట్ల తారకలు !
    బారులు తీరిన తారలు...!!
మహా కాంతి !
    మహాకాంతి !!
చీకటి కడుపున చిల్లులు;
    చీకటి గుండెకు తూటులు.
నవ జగతీ యువవీరులు;
    భవిష్యత్తు కధినేతలు.
మహాక్రాంతి !
    మహాక్రాంతి !!
చీకటి పిశాచి చచ్చెను;
    తాటకి వలె, పూతన వలె,
మేరువుగా శవం పడెను.

*    *    *

తొలి తారక తేజం,
    యువ వీరుని తేజం,
క్రాంతి కాల జాగృతియై
    లోకం ముంచెత్తి వైచె !

*    *    *

అంచాతనె ఆకాశం
    అరుణోదయమై వెలిగెను;
అంచాతనె భూలోకం
    తిరుగుబాటు-ఎరుపెక్కెను !!

*    *    *

అరుణ పతాకచ్ఛాయల
    ఆయుధాల ప్రవాహమై,
అక్షయ తూణీరం వలె ...
అక్షీణ పరాక్రమం వలె ...
    బారులు తీరిన వీరులు !
భారత విప్లవ యోధులు !!

*    *    *

ఒక వీరుడు ...
    ఒక తారక ...
ఒకటే ఒక కాంతి రేఖ !
లోకం తొణికిస లాడిన ...
మహాక్రాంతి !
    మహాక్రాంతి !!

సోమసుందర్, అవంత్స, "వజ్రాయుధం"
కళాకేళి ప్రచురణ, సామర్లకోట.
అవంతీ ప్రెస్, రాజమండ్రి-(విరోధి, ఉగాది)
రాష్ట్రీయ అఖిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం,
అవాప్తి సంఖ్య-2752. 2754, న్యూ ఢిల్లీ.

# 5. స్వరాజ్య గీతామృతము భారతమాత గీతము

("సిరసిరి మువ్వ" వలె)

దండాలు దండాలు భారతమాత
  అవి, అందుకొని దీవించు, భారతమాత
గాంధీ మహాత్ముండు, భారతమాత
  నీ ముద్దుకొడుకుండంగా భారతమాత
మాకేమియును భయము లేదు భారతమాత
మాకేమియును కొదవ లేదు భారతమాత
తెల్లోళ్ళుంటుండగానే భారతమాత
  మాకు చిప్పచేతి కొచ్చిందీ, భారతమాత
మూడువందలేండ్ల క్రిందా, భారతమాత
అలకుంపి నేడు దిగినాడే భారతమాత
దిగి యూరకున్నాడా? భారతమాత
మా దేశమంతా దోసుకొల్లే భారతమాత
కుంపిని రాజ్య మంతరింప భారతమాత
అల సీమరాణి గద్దెక్కి భారతమాత
  శ్రీముఖమును నొకటిచ్చే భారతమాత
గంపెడాసతో చూస్తుంటే భారతమాత
  అదిగాలి బుంగయై పోయె భారతమాత
నిరంకుశాధికార మొచ్చి భారతమాత

మమ్మేమ్మె పుకొని తినుచుండె భారతమాత
నీ పాదాలొక్కటి తప్ప భారతమాత
మా కిప్పుడింక దిక్కేది? భారతమాత
నీవు రత్నాల తల్లివే భారతమాత
నీవు పైరు పంటల నిక్షేపం భారతమాత
మాపాలి కామధేనూ భారతమాత
నీవు మాపాలి కల్పవృక్షం భారతమాత
పాడి పంటల మాలక్ష్మీ ! భారతమాత
మా మొఱ్ఱ లాలకింపుమమ్మా భారతమాత
క్రూరలైన కొట్టకుండ భారతమాత
మా కత్తి కూడ లాగినాడే భారతమాత
భూమిదున్ని బ్రతుకపోతే భారతమాత
ఎంత పెద్ద పన్ను వేసినాడే ! భారతమాత
వర్తక మంతాను కూడా భారతమాత
ఆడె గుత్త కొన్నాడంటా భారతమాత
ఆడే సందరమంత త్రవ్వినట్లు, భారతమాత
ఉప్పుమీద పన్నంటా భారతమాత
అడవులన్ని ఆడివయ్యె భారతమాత
అడుక్కు తినడం మాదయ్యె భారతమాత
భోగమంత వాడిదాయె భారతమాత
బాధలన్ని మావయ్యె, భారతమాత
రక్షిస్తానంటు వచ్చె భారతమాత
మాకు శరణు లేక యున్నాదే భారతమాత
ఆడి రాజ్యమంతా సాలిపట్టు భారతమాత
మే మందులోని యీగలము భారతమాత

ఆడి తీపి తీపి మాటలకు భారతమాత
మా పెద్ద లంత మోసపోయె భారతమాత
నేడు గుండెలలోను మాకు భారతమాత
ఆడు పిరికిమందు పోసినాఁడే భారతమాత
అందరు కల్సియుండకుండా భారతమాత
ఆడు యిడదీసి యేలుతాడే భారతమాత
సదువుకొన్న పెంద్దలంతా భారతమాత
మా కొంప తీస్తున్నారే భారతమాత
తల్లి రొమ్ము ప్రాలు త్రాగి భారతమాత
నీ రొమ్ము గుద్దు చున్నారే భారతమాత
కన్నబిడ్డలె శత్రులైరి భారతమాత
నీవు మన్నించి దిద్దుకొమ్మా భారతమాత
కొత్త బాస తెచ్చినాడే భారతమాత
మా బాసలన్ని రూపుమాసె భారతమాత
ఆడు సదువు సెపుతాడంటా భారతమాత
కీసరి బాస సెపుతాడే భారతమాత
బానిస సదువె సెపుతాడే భారతమాత
మాకు మాయ సదువు సెపుతాడే భారతమాత
మాయదారి సదువు సదివీ భారతమాత
నీ మాట తలసి కొనరాయె భారతమాత
దేశ బాస నేర్చుకోవడం భారతమాత
యెంతో దోసమని తలుస్తారే భారతమాత
అమమ్మ యెంత ద్రోహం భారతమాత
నీకు సేయఁదలఁచుకొన్నారె భారతమాత

శూరుమానం పెద్దలను భారతమాత
మేము తలుసుకొంటె పాపమాయె భారతమాత
కేసరి బాస తెలిసినోడే భారతమాత
ఎంత ఘనుడని తలుసుకొని భారతమాత
ఆ కీసరి బాస తెలియనోణ్ణీ భారతమాత
వట్టి మూర్ఖుఁడని తలుస్తామే భారతమాత
యీ యిసపు సదువుకొన్నా భారతమాత
మా వృత్తులు నశించిపోయె భారతమాత
ముచ్చి ముమ్మాటికిని భారతమాత
మాకు మూడు వృత్తులె మిగిలాయి భారతమాత
కనికార మింతలేకా భారతమాత
　　యెనక గోయి తీయనేర్చినారే భారతమాత
కాసింతైన సిగ్గు లేక భారతమాత
　　కాళ్ళు గ్రుద్ద నేర్చినారే భారతమాత
గోసె పెట్టుకోలేనోణ్ణి భారతమాత
　　వారు సేసాప జంకరమ్మ భారతమాత
పేరెన్నిక గన్నతల్లి భారతమాత
　　నీ శక్తి మరిచి పోనారే భారతమాత
మాతొంటి సదువు మాకిచ్చి భారతమాత
　　యీ దగాబుద్ధి పోగొట్టూ భారతమాత
పాడిపంటల మాలక్ష్మీ భారతమాత
　　మా యిన్నపం మన్నించూ భారతమాత
కోర్టులంటూ వచ్చినాయీ భారతమాత
　　మా కొంపలు కూలబడిపోయె భారతమాత

కోర్టు వచ్చి మాలోనూ భారతమాత

నేడు పార్టీలు పుట్టినాయె భారతమాత

మాలోమావు యజ్యమ్మాడి భారతమాత

వకీళ్ళ పాలయినామె భారతమాత

ఆడెంత చమతకారోడూ భారతమాత

న్యాయమంత అన్యాయం భారతమాత

అన్యాయమును న్యాయముగ భారతమాత

ఆడు సిటికిలోను వోదించి భారతమాత

యిట్టె తారుమారు సేస్తాడే భారతమాత

ఆడు తలలు మారిసేస్తాడే భారతమాత

డబ్బుకోసం మాన మమ్మి భారతమాత

ఆడు లంజబ్రతుకు బ్రతుకుతాడే భారతమాత

కొంత డబ్బొకీళ్ళపాలు భారతమాత

కొంత డబ్బు సాచ్చం పాలు భారతమాత

మాట్లాడితేని లంచాలు భారతమాత

అడుగడుక్కి డబ్బు ఖర్చు భారతమాత

ఇంత డబ్బోసు కుంటున్నా భారతమాత

నిబద్దిగా న్యాయం లేదు భారతమాత

గెల్చినోడు యింటికాడ భారతమాత

మఱి ఓడినోడు యీదిబడి భారతమాత

నెత్తి మొత్తుకొనుటాయె భారతమాత

ఇంత ఖర్చు యేటికమ్మా భారతమాత

ఇంత శ్రమ యెందుకమ్మా భారతమాత

మేము కడుపులో సల్ల కదలకుండా భారత

మావూరు పెద్దలు సెప్పుమాట భారతమాత
మాం యినుకుంటె సిక్కింది? భారతమాత
సూరీడు సందిరుడూ భారతమాత
　　సాచ్చులైన కాలమల్లె భారతమాత
తాటాకు పత్రాలు భారతమాత
　　మంటగాలిపోనాయి భారతమాత
శిలమీద శాసనాలు భారతమాత
　　సిందయి పోనాయి భారతమాత
స్టాంపు కాగితాలు వచ్చే భారతమాత
　　మాలో యిస్వాసం పోనాదే భారతమాత
మాకు కావేసి లెచ్చిపోయె భారతమాత
　　యిల్లమ్మితె స్టాంపు ఖర్చు భారతమాత
భూమి అమ్మితె స్టాంపు ఖర్చు భారతమాత
అప్పిస్తె స్టాంపు ఖర్చు భారతమాత
　　అది యిది అననేలా భారతమాత
మాట్లాడితె స్టాంపు ఖర్చు భారతమాత
　　న్యాయమెపుడైనకానీ భారతమాత
మనము కొనియెరిగి యున్నామా భారతమాత
మేము కుల పెద్దల నెట్టుకొని భారతమాత
　　ఆళ్ళు చెప్పినట్టా యినుకుంటాం భారతమాత
పాడి పంటల మాలక్ష్మి భారతమాత
　　మా యిన్నప మాలించు భారతమాత
బిరుదుతో కలాసించి భారతమాత
　　పెద్దలు తిరుగులాడుతున్నారే భారతమాత

ఎంత నీచమైన చేస్తారే భారతమాత
నీ కడుపు చెరుపబుట్టేరే భారతమాత
నీ గౌరవము సెడతీసి భారతమాత
యెంత సిగ్గుమాలియున్నారే భారతమాత
శాసనాల సభలంటా భారతమాత
వట్టి సేతకాని సభలమ్మా భారతమాత
మనమాట చెల్లని సభలలోకి భారతమాత
మాకంగీకారం లేకున్నా భారతమాత
యీాళ్ళు తగుదుమని యెల్తారే భారతమాత
ఆళ్ళసిగ్గు బొగ్గులైపోనూ భారతమాత
యిపుడు తెల్ల మొగాలేసేరే భారతమాత
మనమాట చెల్లని నాడేలా భారతమాత
ఆళ్ళ సభలలోకి యెల్లడం భారతమాత
బుట్ట పాగాలెట్టుకొనీ భారతమాత
మళ్ళ కొత్త పన్నులు గట్టినారే
ఉన్న పన్నులె గట్టలేకా భారతమాత
మేము ఘోస పెట్టుసుంటేని భారతమాత
మా పాలి యమదూతలయి భారతమాత
యీా కొత్త పన్ను లెక్కడొచ్చె భారతమాత
ఆలిమెళ్ళో పుస్తి పూస భారతమాత
అన్ని అమ్మజూపేసి నామె భారతమాత
నూట తొంబై మూడు కోట్లు భారతమాత
సిస్తు దస్తు చేస్తాడే భారతమాత
ప్రజల కోసమయిన ఖర్చు భారతమాత

ఒక్క యిరువై మూడు కోట్లె సుమ్మ భారతమాత
మిగిలిన రూపాయలకూ భారతమాత
ఆళ్ళు పూచీదార్లు కారంటా భారతమాత
యిదెక్కడి న్యాయమమ్మా భారత
పండినా యెండినా భారతమాత
శిస్తు గట్ట దప్పదమ్మా భారతమాత
పండుతున్నా సస్య మంతా భారతమాత
యింగ్లాండునకు పోనేల భారతమాత
నీ కన్న బిడ్డలు కూడులేక భారతమాత
నిరుపేదలయి మనుచుండె భారతమాత
ఇది యది యననేలా భారతమాత
యెల్లదినుసు పోతున్నాదె భారతమాత
మాగొడ్డు లేని బ్రతుకకుండా భారతమాత
వట్టి గడ్డి కూడ పోతుందె భారతమాత
డబ్బుమీద యెరపడి భారతమాత
మా గొంతుక కోసుకొంటున్నామె భారతమాత
నీకు పుట్టి నీయన్నం భారతమాత
తిన నేర కున్నామె భారతమాత
నీవు రత్నాల తల్లివే భారతమాత
నీవు పైరు పంటల నిక్షేపం భారతమాత
నీవు మాపాలి కామధేను భారతమాత
నీవు మాపాలి కల్పవృక్షం భారతమాత
పాడిపంటల మాలక్ష్మీ భారతమాత
నీ భాగ్య మనుభవించ లేక భారతమాత

మేము కాళ్ళ దన్నుచున్నామె భారతమాత
మా రైతోళ్ళకి బుద్ధి లేదూ భారతమాత
పండుతున్న పంటలన్నీ భారతమాత
వతనికే పంపుతారే భారతమాత
సీమ కంపుతున్నారే భారతమాత
పత్తి వతనికంపకుండా భారతమాత
మా రైతోళ్ళకి బుద్ధి సెప్పూ భారతమాత
మాబెల్ల మచ్చులన్నీ పోయీ భారతమాత
మాకు యెముక ముక్కల పనసదార భారతమాత
అమ్మమ్మ కన్నతల్లి భారతమాత
వతని వస్తువొకటైనా భారతమాత
కొనకుండా బుద్ధిసెప్పూ భారతమాత
కట్టబట్ట తినగ తిండి భారతమాత
ఒక్క పూటకైనా లేదమ్మా భారతమాత
చాకిరైన సేయంగా భారతమాత
మాకు శక్తి కూడా లేదమ్మా భారతమాత
యింత సత్తువైన లేదమ్మా భారతమాత
మేమెప్పుడును యింత బాధ భారతమాత
పడియెరుగ మోయమ్మ భారతమాత
అమమ్మ మాలక్ష్మీ భారతమాత
- నీకెంత కష్ట మెంత కష్టం భారతమాత
మా సాలోళ్ళు బ్రతుకకుండ భారతమాత
ఆళ్ళ బొటనవ్రేళ్ళు నరికినాడే భారతమాత
గుడ్డ లెంత్రాలు వచ్చి భారతమాత

మా మగ్గాలు పడ(్రదోసె భారతమాత
బట్టలు నేసె యంత్రాలు
మాకు కలనైన వద్దమ్మా భారతమాత
మా కూలి పడిపోతుందే భారతమాత
మా బ్రతుకె చితికిపోతుందె భారతమాత
యింటింట రాట్నం పెట్టి భారతమాత
నీ కంటి నీరొత్తు ●ముమె భారతమాత
అమ్మమ్మ కన్నతల్లీ భారతమాత
మా మనవు లాలించు మమ్మా భారతమాత
అరవై కోట్ల రూపాయలు భారతమాత
యేట బట్టలమీద పోతుందే భారతమాత
అబ్బబ్బ యెంత సొమ్ము భారతమాత
ఆళ్ళ పొట్టబెట్టుచున్నామె భారతమాత
డబ్బంత పట్టికెళ్ళి భారతమాత
ఆడి కొంప నింపుతున్నాడె భారతమాత
మా రాట్నం మూలపడగానే భారతమాత
మహాలక్ష్మి మమ్ము యిడిసిపోయె భారతమాత
ఆనాడు మొదలుకొని భారతమాత
మాకు గంజినీళ్ళు కరువయ్యె భారతమాత
యింక వతని బట్టలు కొనకుండా భారతమాత
నీవు ఘోరమైన వొట్టుబెట్టు భారతమాత
ఆడక్కడి నుండి వతనికాడ్కి భారతమాత
పెద్దడబ్బు కాల్వ గట్టినాడె భారతమాత
ఎలుగు గొడ్డు తేనెపట్టు భారతమాత

యెట్లు మాయం జేస్తుందో భారతమాత
మా డబ్బంత.తెల్లోళ్ళు భారతమాత
మాయ చేస్తున్నారె భారతమాత
మా వంటినున్న రక్తం పోయి భారతమాత
నేడు దుమ్ములే మిగిలినాయి భారతమాత
కట్టుబట్ట తినెడి తిండి భారతమాత
వతని కాడ్కి పోతుందే భారతమాత
తిరిగి మాకు వచ్చేయి భారతమాత
మా నల్లదొరల నెక్కటయిలు భారతమాత
వారి పిల్లలకు పాలబుడ్లు భారతమాత
వారు తిండి తినగ చిప్పదొప్పా భారతమాత
వా రూత గొని చేతికఱ్ఱా భారతమాత
వారు కాల్చంగ సిగిరెట్లు భారతమాత
వారు దాగి దొర్ల విస్కీలు భారతమాత
అరవై కోట్ల రూపాయలు భారతమాత
యేట తాగుడు మీద పోతుందే భారతమాత
ఎంత బుద్ధి తక్కువమ్మా భారతమాత
మేమిప్పుడైన బుద్ధి కల్గి భారతమాత
నీ పాదాల తోడమ్మా భారతమాత
మే మెప్పుడును తాగమమ్మా భారతమాత
నీ పాదాల నొట్టుకొనీ భారతమాత
మేమొట్టెట్టు కొంటున్నామె భారతమాత
నిజమాడ వీలు లేదు భారతమాత
"రామ రామ" యంటే బూతు

మా కాళ్ళు సేతులు గట్టేసి భారతమాత
　　మా నేరు మూత పెట్టినారె భారతమాత
నోరు వాయి లేని మాపై భారతమాత
　　యీ ఘోరమైన శాసనాలా భారతమాత
అల్ల ఘోరమైన యుద్ధములోను భారతమాత
　　మా దబ్బూ ప్రాణం పుచ్చుకొని భారతమాత
మా జన్మహక్కు మింగేటి భారతమాత
　　అల్ల "రౌలటు శాసన" మిచ్చె భారతమాత
అది నల్లత్రాచు పామమ్మా భారతమాత
　　నలబయి మూడు కట్లపామె భారతమాత
దిక్కు లేని దీనులకు భారతమాత
　　అల్ల దేవుడే దిక్కమ్మా భారతమాత
మా దేవ దేవుండు భారతమాత
　　మమ్మేలుకొనే మారాజు భారతమాత
మా గాంధీ మహాత్ముండు భారతమాత
　　నీవు నోచుకొన్న నోము పంటా భారతమాత
యీ ఘోరమంతా సూదలేక భారతమాత
　　మమ్ము సత్యవ్రతము పట్టించె భారతమాత
నిజమాడితె నిష్ఠూరం భారతమాత
　　ఉన్నదంటె ఉలికిపాటు భారతమాత
పంజాబు దేశమందు భారతమాత
　　అయ్యో! ప్రాణాలు దీసినారే భారతమాత
కండ్లిప్పని బిడ్డలను భారతమాత
　　కొరడాలతో బాదినారె భారతమాత

యెండబెట్టి సంపినారె భారతమాత

గుండ్లేసి చెండినారె భారతమాత

మావాపలేని తల్లులను భారతమాత

పొడిసి పొడిసి చంపినారె భారతమాత

ప్రాణాలు పోతె పోయె భారతమాత

అసలు మానమునకె మోసమొచ్చె భారతమాత

భర్తపోయి యేడుస్తుండా భారతమాత

మా తల్లి బట్టలొలిసేసి భారతమాత

ఒలిసి మానం సెడిపేసి భారతమాత

ముళ్ళపాలు చేసినారే భారతమాత

అయ్యయ్యో! యెంత సిగ్గు! భారతమాత

శిశుహత్య స్త్రీహత్య భారతమాత

భ్రూణహత్యలు చేసినారే భారతమాత

రాజ్యానికి పట్టినట్టి భారతమాత

ఈ సైతాన్ని వదలగొట్టు భారతమాత

మా మానమంతా మాసిపోయె భారతమాత

మా కింక స్వేచ్ఛ యెక్కడమ్మా భారతమాత

మా మతమంతా మొదలెపోయె భారతమాత

మా ఆచార మడుగంటె భారతమాత

ఇస్లాము మతముకూడ భారతమాత

అడుగంటి పోయిందె భారతమాత

మతాలన్ని మాసిపోయె భారతమాత

అవి నిలుపనీదె భారమమ్మా భారతమాత

నీ పాదాలొకటె తప్ప భారతమాత

మాకు దిక్కు వేఱె లేదమ్మా భారతమాత

దొరలు పెట్టు బాధలకు భారతమాత

మే మోర్వలేక యున్నామే! భారతమాత

నీ మానమును నిల్పంగ భారతమాత

మా ప్రాణమైన ఒగ్గుతామె భారతమాత

అమ్మమ్మ కన్నతల్లి భారతమాత

మా పెద్దన్నల నిద్ర నుండి భారతమాత

యిప్పుడైన లేవగొట్టు భారతమాత

లేకుంటె బ్రతుకె సున్న భారతమాత

నీ ముప్పయైదు కోట్ల ప్రజలు భారతమాత

స్వరాజ్యమారు నెలలలోనె భారతమాత

నడుముకట్టి తెచ్చుశక్తి భారతమాత

యిచ్చి మమ్ము రక్షించు భారతమాత

ప్రాణం పోయె టప్పుడైన భారతమాత

మమ్ము సత్యం తప్పనీయకమ్మా భారతమాత

మే మెవరిని హింసించకుండా భారతమాత

మాకు ధైర్యమిచ్చి రక్షించు భారతమాత

నీకన్న గంపెడు బిడ్డలుండ భారతమాత

నీకు విజయము నిశ్చయమమ్మా భారతమాత

సీతారామాంజనేయులు, వడ్లాది; శాస్త్రి, కాశి విశ్వనాథ, పూడి పెద్ది.
"స్వరాజ్య గీతామృతము" వి.యస్. ప్రెస్, రాజమండ్రి.
(పందిరి మల్లికార్జున రావు, రాజమండ్రి) 1921–23
రాష్ట్రీయ అఖిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం
అవాప్తి సంఖ్య 2777. న్యూ ఢిల్లీ.

# 6. నవయుగము-గాంధీ విజయము

(నవరోజు-త్రిశ్రజాతి-ఏక తాళము)

స్వదేశ మాతనీ, పదారవిందముల్
    సదామదిన్ భజించెదన్ ముదంబు గూర్పుమా ॥
వరాల తల్లి మా మొరాలకింపుమా
    బిరాన కనికరానగని, వరాలొసంగుమా ॥ (స్వదేశ)
శ్రితార్థి చూతమా, హతారి పూతమా
    హితంబు గరిపి మము కృతార్థ, మతుల జేయుమా ॥ (స్వదేశ)

## బాలభటుల దేశీయ గీతం

(భూపాళ రాగము-చాపు తాళము)

మేలుకొనుమీ భరత పుత్రుడ
మేలుకొనుమీ సుజన మిత్రుడ
మేలుకొనుమీ సచ్చరిత్రుడ
మేలుకొనుమయ్యా ॥వత్సా॥ (మేలుకో)

వేడుకను జాతీయతాయను
వేగుచుక్క పొడిచె నదిగో
కూడి "వందేమాతరం" యని
కుక్కుటములరచెన్ ॥వత్సా॥ (మేలుకో)

అంతటను నవశక్తి యనియెడు
కాంతి పుంజము తేజరిల్లెను
మంతనంబున నూతనోద్యమ
మారుతము వీచెన్ ॥వత్సా॥ (మేలుకో)

అందరును నీకంటె ముందఱ
నడుగులిడుచును మెలగుచుండగ
పందవలె నిటు నిద్ర వోవగ
పాడియగునయ్యా ||వత్సా|| (మేలుకో)
ఒక్క ప్రాణమె యందరిది మా ||
దొక్క మనసే యందరిది, మే ||
మొక్క మార్గమె దొక్క గలమని ||
నొక్కి వక్కాణింప వడిగా మేలుకో ||వత్సా మేలుకో||

## ప్రబోధము

వరభూమి మన పుణ్యభాగ్యంబురా
భరత మాతకు సేవ భారంబురా || (పల్లవి)

భూలోకమున కెల్ల ముత్యంబురా
క్ష్మాతలంబున సూర్యచంద్రులురా
భరతతల్లి మనకు సర్వంబురా
పూర్వజన్మ సుకృత పుణ్యంబురా|| (వర)

ధీరులను గన్న పృథ్వీ స్థలమురా
వీరమాత యనెడు పేర్గాంచెరా
మౌనులను గన్నట్టి మనతల్లిరా
క్షత్రియుల గన్నట్టి శౌర్యాద్రిరా || (వర)

భరతవంశము గన్న ప్రౌఢాత్మరా
పదియవతారముల పావనిరా
భీష్మద్రోణుల గన్న పృథ్వీ మణిరా
భీమార్జునుల గన్న ప్రియభూమిరా || (వర)

మంత్రశక్తికి గొప్ప యంత్రంబురా
పతిభక్తి శక్తి గొప్పకు మేటిరా
కర్మయోగము కగ్రగణ్యంబురా
సత్యాగ్రహ వ్రత సద్ధర్మరా ॥ (వర)

## గీతమాలిక

ధర్మమే రథము మన యుద్ధమున నేడు
ధర్మ మూర్తియే సారధి ధరణి మనకు,
దేశసేవ కెల్ల త్యజించి దేనికైన
సిద్ధమగువాడె యుద్ధ సంసిద్ధుడిపుడు,
శాంతమే దివ్య శస్త్రాస్త్ర సాధనములు,
ఆత్మ పారిశుధ్యమె స్వరాజ్యంబు మనకు
మన స్వశక్తిని నమ్ముటే మనకు దారి,
బానిసత్వ విముక్తియే వర జయంబు
మనసు మన మెరుంగుటె గొప్ప ఘనత మనకు ॥

పుండరీకాక్షుడు, దామరాజు, "నవయుగము-గాంధి విజయము" (నాటకము)
చంద్రికా ముద్రాక్షరశాల, గుంటూరు, అక్టోబరు 1921.
రాష్ట్రీయ అభిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం,
అవాప్తి సంఖ్య-2794, న్యూ ఢిల్లీ.

# దేశభక్తి ప్రబోధిత పద్యములు

## (ద్వితీయ భాగము)

# 7. స్వరాజ్య మహాసభ

(అహమ్మదాబాదు కాంగ్రెసు)

సీ॥ రోజు రోజుకు వందలును వేలు స్వచ్ఛంద
సేవకుల్ చెరసాలఁ జేరుచుండ
స్త్రీ రత్నములు దేశసేవకై గృహముల
విడనాడి జైలుకు వెడలుచుండ
విద్యార్థులందరు వేడ్కతో శాంతి సై
న్యముఁ జేరి ఖైదుకు నడచుచుండ
సమజ విక్రమ శూర శాలులౌ వంగ దే
శజులు సిక్కులు గూడ శాంతమూన

గీ॥ దాసు, లజపతి, నెహ్రూ ప్రధాన నాయ
కాగ్ర గణ్యులె కారాగృహములు జేర,
భరత జనులార, మీరింక బ్రతికి యుండి
చూచు చుందురే? మర్యాద గాచుకొనరె? ॥

సీ॥ ఆనాటి పాండవులీనాటి యసహాయ
వాదులై యిడుముల బడుచునుండ
ఆనాటి పాంచాలి యీనాటి పాంచాల
మగుచు పరాభవ మందియుండ
దుష్ట దుశ్శాసన దుర్యోధనులు నేటి
దయ్యు రోద్వయరులై కయ్యమూన
విదురుడై యాండ్రూసు, భీష్ముడై మాలవ్య
రీడింగు కర్ణుడై నేడు వెలయ.

గీ॥ కృష్ణుడై గాంధి సారథ్య మిపుడు జరుప
భారతము శాంతి యుద్ధ నిర్వహణమునకు
గడగి, తుది రాయబారంబు నడుపు చుండె
ధరణి కింకొక భరత యుద్ధంబు దొలగు
రాజ్యమిప్పటికైన మేల్కాంచ వలదె ॥

## శ్రీ చిత్తరంజనుని ప్రభోధము

మ॥ తమ త్యాగంబభివృద్ధియౌ కొలది స్వాతంత్రంబు హెచ్చె, స్వరా
జ్యము శీఘ్రంబుగ వచ్చునంచు, మదినుత్సాహంబు పొర్లంగ, ధై
ర్యమునన్ శాంతమనస్కులై యిపుడు కారాగారముల్ జొచ్చి దే
శమ్ముకై కష్టములోర్చు ధీరుల ముఖాబ్జంబుల్ విలోకించుడీ ॥

మ॥ (ఘన) మన సంగ్రామమునందు తుట్టతుది రంగంబిప్పుడేతెంచె,నిం
కను పోరాటముఁ జొచ్చి మాతృభువి పక్షంబుంటినా, లేదొకో,
యని యొక్కక్కరు ప్రశ్న వేసికొని, దీర్ఘాలోచనల్మాని వెం
టనె రండీ, మన శాంతి సేనఁ కలయంగా భారతీయ ప్రజల్ ॥

సీ॥ ఊరకే, యలి సహోదరుల్ తమ ప్రాణ
ముల తెగించిరె జన్మభూమి కొరకు
ఊరకే, నేడు నెహ్రూ మహాభోగి సౌ
ఖ్యముల రోసియు జైలుకరగినాడె?
ఊరకనె, లజ్పతిరాయ ధీరుండు
చెరలో నివాసమేర్పరుచు కొనెనె?
ఊరకే, యెందరో యుత్సాహ భరితులౌ
స్వచ్ఛంద సేవకుల్ సాగినారె?

గీ॥ వారి యాశలన్నిటిని మీపైన నిలిపి
మాతృ భూమికి యాత్మ సమర్పణంబె
యుచితమని దోచి చెరసాల కురికినారు
జయము చేకూరు, జనులార సాగిరండు ॥

## నిర్బంధింపబడిన నాయకులు

ప్రథమ ప్రతినిధి మహాసభకెన్నుకోబడిన యధ్యక్షుడు చిత్తరంజన్ దాస్

చ॥ నెలకొక లక్షలో సగము నెమ్మి గణించుచు మేటి న్యాయ వా
దులకును న్యాయ వాదివయి దొడ్డ యశంబు గణించి భారతీ
యుల కయి సర్వమున్ విడిచి యోపికతో శ్రమ జేసిజేసి నే
డలసిన యట్లు జైలునకు హాయిగ బోతివె చిత్తరంజనా ॥

శా॥ నీయధ్యక్షత క్రింద గాంధిఋషి సాన్నిధ్యంబునన్ గూడి మే
మీ యేడాది స్వతంత్ర రాజ్యమును స్థాపింపంగ నూహించి యెం
తో యాశన్ గొనియున్న మమ్ము విడి నీ వొక్కడవే బోతివా
హాయిన్ జైలునకేర్పనంగ మహనీయా చిత్తరంజన్ ప్రభూ ॥

సీ॥ వంగ దేశమున నీ ప్రఖ్యాతి వెదజల్లి
దుష్ట రాజ్యము పైకి దూకినావు
చిచ్చుర పిడుగువై చెచ్చర దేశ మం
తట నీ మహాశక్తి నాటినావు
యేడాదిలోనె "నీ కెన యేరురా" యన
మించు శక్తిని విజృంభించినావు
అఖిల భారత సభాధ్యక్షక స్థానంబు
నవలీలగా గెల్పొందినావు
ఔర! నీ యుపన్యాస వాగామృతమున
చిత్తముల నెల్ల రంజింప జేసినావు
చిత్తరంజన దాస సత్శేఖరుండ
దేశబంధూ, యిదే, సమస్తే నమస్తు ॥

## లాలా లజపతి రాయ్

మ॥ మరలన్ జొచ్చితి యిల్లు వత్సరములమ్మాడ్కిన్ ప్రవాసంబునన్
జరుగన్ బుచ్చియు, వచ్చియింకనొక వర్షంబైనదో లేదొ, నే
డరుదెంచెన్ చెరసాల శిక్ష, మహనీయా లజ్పతీధీర, యిం
దరు హిందూ భువి నందనుల్ గలుగ వ్యర్థంబౌనె నీ కష్టముల్॥

ఉ॥ అంతటి నోము నోచుకొనినప్డు స్వరాజ్యము గల్గనేని నీ
యంతటి వాడు మాకు గలడంచును నిన్నొక చక్రవర్తి గా
వింతు మటంచునాశగొని వేడ్కదినంబుల లెక్క పెట్టుచు
న్నంతనె నీకు గల్గెను మహాపద లజ్పతిరాయధీర, కా
సంతయు లెక్కబెట్టకుము హైందవులందరు నూరకుందురే ॥

## నెహ్రూ

ఉ॥ రాచరికంపు భోగముల రమ్య తరంబుగ సౌఖ్యమొందుచున్
నీచపు దాస్యంబంధముల నీవు సహింపక దేశమాతకై
నీ చిరకాల సౌఖ్యముల నీటను గల్పిన త్యాగ మూర్తి వౌ
రా, చెరసాల కేగితె స్వరాజ్యము గోరుచు నెహ్రూ ధీమణీ ॥

## అలీ సోదరులు

చ॥ జనని సుగర్భమందు నరజన్మము దాల్చిన దాది ధీరు లీ
మన పులి పిల్లలిర్వురు శ్రమంపడుచుండి స్వరాజ్య భాగ్యమున్
గనుగొనగా తపించుచు సుఖంబులరోసి వెతల్ భరించి, చా
వునకు తెగించి జైలునకు బోయిన సోదరులన్ దలంచుడీ ॥

శా॥ ఏ సుల్తానులో, యే నబాబులో, మరే యే రాజసింహంబులో
యై, సత్సీమలలో జనించుటకు మారయ్యో! యిటుల్ దీనులై
యీ సన్యాసి దినాల బానిసలుగా హిందూ భువిన్ బుట్టియున్
రోసా వేశము బట్టజాల కిటు జైలున్ జేరిరాలీపులుల్ ॥

# హెచ్చరిక

సీ॥ ఆలీద్వయంబును జైలులో బెట్టుచో
నాలీ ద్వయంబులు వేలుబుట్టు
గాంధీ మహాత్మునే ఖైదులోపలనుంచ
జగమెల్ల గాంధులై సాగగలదు.
స్వాతంత్ర వాంఛనే చావగొట్టగ నెంచ
స్వాతంత్ర వాహినుల్ పారగలవు.
నోరు చేతులు గట్టి వారింప మాభూమి
రాళ్ళు రప్పలు గూడ నోళ్ళు విప్పు.

గీ॥ ఎందుకీ పెద్ద రాద్ధాంత మెందుకిట్లు
పెనుగులాడుట యీ కాని పనుల కొరకు
నెప్పటికినైన మీ కది తప్పబోదు
మా స్వరాజ్యంబు మా కిచ్చి, మనము మనము
సరి సమానమౌటయే క్షేమ కరము భువికి ॥

సీ॥ కోరుకొండు ధనంబు పారవేయగలార
మేడాదికిన్ని కోట్లిత్తుమనుచు
యాచించుకొనుడు మీ కొసరంబగునెట్టి
సాయమే నొసగ వెన్దియమిపుడు
కావలెననుడు మీ కడుపార మాతోటి
పాటింత కూటికి లోటులేదు
మా దేశమున నిల్చి మీదు వర్తకమును
సాగించుకొనుడు మీ శక్తి కొలది

గీ॥ ఇట్టి వెన్నైన మాకు లెక్కేమి లేదు
గాని మా పైన నధికారమూని మమ్ము
బానిసల మీడ్కి పరిగణింపంగ మేము
సైపగాలేము భారత జాతిమాది.

సీ॥ వారితో వీరితో వైరంబులను మాని
రాజీపడిన యంత లాభమేమి?
జగమంతటను శాంతి స్థాపింతు మనుచు "వా
షింగుటన్" సభ లెన్ని జేయనేమి?
స్వల్ప దేశముల రక్షణకేము గలమంచు
నతి ప్రగల్భములెన్ని యాడనేమి?
అయుధ ప్రాబల్యమాపగా నియమముల్
సలిపిన మాత్రాన ఫలితమేమి?

గీ॥ ఔర! భూలోక స్వర్గమౌ భారతమున
కడుపు మండించి ప్రజలనుగ్గాడుచుంట
దాచి పెట్టిన యెన్నాళ్ళు దాగగలదు?
నిజముగా మీరు శాంతమే నిలుపనెంచ
మాదు రాజ్యంబు మా కిచ్చి మనుటె సాక్షి ॥

ఉ॥ భారత దేశమందు మత భక్తికి మించిన శక్తి యున్నచో
నారయ స్త్రీ ప్రతివ్రతయె యట్టి మహత్తరమైన శక్తి, మా
స్త్రీ రతనాలపై చిలిపి చేష్టలు చేయు, బలాఢ్యులైనయున్
వారల తాతలైన క్షణ భంగుర మంచు త్రిశుద్ధి నమ్ముడీ ॥

పుండరీకాక్షుడు, దామరాజు; ప్రథమ ప్రతినిధి మహాసభ అను స్వరాజ్య
మహాసభ (అహమ్మదాబాదు కాంగ్రెస్)
ఆర్య వైశ్య ముద్రాక్షర శాల, గుంటూరు.
రాష్ట్రీయ అభిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం,
అవాప్తి సంఖ్య-2797, న్యూ ఢిల్లీ.

# 8. స్వతంత్ర గర్జన

అదిగో! చూడుడు! పూతఁబట్టి కసుగాయల్
        పుట్టు లేమావి గు
న్న దరిన్ గట్టిన పైడికోట, వినుఁ దన్నా
        దానిలో నున్న తొ
మ్మిది వన్నెల్ రతనాల మేడపయి లక్ష్మీదేవి
        సంసార సం
పదతోఁ దూగు స్వతంత్ర భారతసతీ
        ప్రారబ్ధ మెట్లాయెనో.

కట్టుదిట్టాలచే ఘనశతఘ్నులకాగు
        చుట్టు ప్రాకారాల పట్టువోయి
సింహ పంజాలచేఁ జీల్చి గుండెలుతీయు
        పహరా జమానుల బలము తగ్గి
ధనపు సంచులతోడ ధైర్యసాహస మిచ్చు
        పెద్ద షరాబుల పేరు తఱిగి
నాగేటి పాట్లచేఁ ద్యాగ శీలము లిచ్చు
        రైతు రాజులు పెద్ద గోతినిబడి
కూటి మందరగిరి మోసి గోలనుడుపు
కూలి కూర్మావతారంబు కూలిపోయి
రవ్వల స్వతంత్ర భారత రాజ్యలక్ష్మి
కంటి తడియారనిదియయ్యె కడకు నేఁడు.

నేఁటికి ఱాలుకర్గు కరణిన్ గురిపించిన
        కన్న తల్లి క
న్నీటి కణాల నుంచి మహాధీయ పరాక్రమ
        సింహులెందఱో

ధాటిగఁ బుట్టుచున్ ప్రళయ తాండవ
గర్జన సేయుచున్ గటా।
తోటి కుటుంబినీ మణులతో బలియైరి
స్వతంత్ర భూమికిన్.

క్రిమినలు ఘోర్సుచేఁ జెవులు గింగురు
లెత్తెడి మాడ్కి ప్రేల్చు కొ
న్ని మఱి ఫిరంగి గుండ్లను గణించకదూకి
సివంగి గండ్ల వె
న్ని మెడలు త్రుంచి, భారత మనీష
విలాస కళా ప్రపంచ వీ
ర మహిళ యున్న గుమ్మమున రత్నపు
తోరణమట్లు గట్టెనో.

ఆ యెగఁబడ్డ సింహ నివహంబుల పైఁ బసి
పట్టి మారణో
పాయములెల్లఁ బన్నుచుఁ దుపాకులు
ప్రేల్చుచు వల్లకాటిగాఁ
జేయుచు వేటకాండ్రు పరిశీలన
జేయుచు కన్న తల్లి దీ
ర్ఘాయువుఁ దీయఁబోయిన భయంకర
మేదిని వంకఁ జూడుడి.

పట్టు పందిరిలోని చిట్టి దంపతులపైఁ
బిడుగు కైదువుల గుప్పించినారు
నిండు గర్భములోని పిండము వడునట్లు
నింతుల పడఁద్రోసి యీడ్చినారు
యెక్కొక్క తల్లికై యేడ్చు కుర్రలనెల్ల
నడి యెడారులలోన విడిచినారు.

పట్టుదలగ నీళ్ళు ముట్టని దిట్టల
బలమికొలందిమెడ నులిమినారు
కలియంబడు గడుసుల తాటనొలిచినారు
తోకంద్రొక్కిన త్రాచులై లోక భీక
గ బడబాగ్ని ఖండములను గ్రక్కి గ్రక్కి
రోయుచున్నారు ప్రేగులు తీయువారు.

ఏ నడి లోగిళ్ళలో నిప్పు కణికలు
ధారచే నింకం జల్లార లేదు
ఏ గర్భ గోళమ్ములో దొర్లు పిండాలు
చెదరి భూస్థలి నింకం జితుక లేదు
ఏ కుఱ్ఱ లేడ్పులు నేటేట గాడ్పులై
తల్లి దిక్కున నింకందగ్గ లేదు
ఏ డొక్క లెండిన కోడె ప్రాయపు వాండ్రు
బిగిసి ప్రాణాలింక విడువలేదు
ఏ మహా వజ్రకాయమ్ములీ కసాయి
తీవ్ర ఖడ్గ ఖండన కింక తెగుట లేదు
ఏ ప్రతి ధ్వనిచేత మహా ప్రతిజ్ఞ
నిద్ర పట్టనీయుట లేదు రుద్ర భువిని.

అంతటి ఘోర కృత్యముల కక్కట
మృత్యువు నోటంజిక్కి ది
గ్దంతుల గుండెపెట్లంబడు కైవడి
ఘోషిల్లుచున్న తల్లి ది
క్కింతయు గాంచకుండ కలహించుట
పాడియె యొండొకళ్ళు? మీ
పంతము తల్లి ప్రాణికయి వచ్చిన
దేమిర? భారతీయుండా.

కొన ప్రాణమ్ముల నున్న తల్లిపయి చూడ్కుల్
పోక వ్యామోహ ది
క్కున కేడ్పించెడి ఆస్థిపాస్తులకయిన్
గొట్లాటకున్ లేచి పో
యిన మూర్ఖుల్ బలె; తిర్గుబాటు తగునా
హిందూ ముసల్మాన్ యశో
ధరులారా! పొరిగింటి తుంటరుల
కంతా చుల్కనై పోదురా.

ధ్రువమును వీడి దుర్మదపు దుష్ట చతుష్టయ
మెల్ల పంచపాం
డవులను మున్ను కాఅడవులన్ నివసింపగ
జేసినట్లు హిం
దువులను దుర్మదాంధతను దుష్ట
చతుష్టయమై సహించ కి
ష్టవతల నుంచి పంచముల నక్కట
యెన్ని విధాలఁ ద్రొక్కిరే.

కంటఁ బడకుండ కానలోఁ గష్టపడిన
పంచపాండవులెవని స్మరించినారొ
అట్లె యిఁక పంచములు హరినాశ్రయించి
హరిజనులయినారని యెంచుడార్యులార.
పచ్చని కొంప పాడుపడి పస్తులతోఁ బడి
పోయి వీధిలో
వెచ్చని బాష్పవృష్టిఁ గురిపించిన భారత
మాత మూర్ఛచేఁ
జిచ్చుల పిడ్గులెన్నొపడి చిట్లిన గడ్డకుఁ
బ్రాణి పోయగా

వచ్చె మహాత్మగాంధి; పరి పంధి
రథంబులు దారిఁ బట్టగన్.
మల మల మాడు పొట్టకయి మానము
నిల్పెడి నూలు బట్టకై
కల యెజమాని బండి కలకాలము
లాగెడి బక్క యెద్దువై
నెలకొక మాటు తేఁబడెడి నీ దినభత్యము
మ్రింగు కల్లు ముం
తలఁబడఁగొట్టు గాంధి చరణమ్ములు
వట్టుము పేద బిడ్డడా.

లోకములో మఱెక్కడ బలుల్ ధనికుల్
ఘటియింపకుండగాఁ
బ్రాకటమైన ప్రాభవము రాటపు
చక్రము తోడఁ దీసి యే
కైక నియంతయై ప్రకృతి కంతకుఁ
జల్లని శోభఁదెచ్చు దీ
క్షా కవచమ్ముఁ దొడ్గెసుమి గాంధి
మహాత్ముఁడు; నవ్వఁబోకుడీ.

కష్టకాలమ్ము గడుపు చర్ఖాను ద్రిప్పి
స్వీకరించిన కాంగ్రెస్ పతాకమన్న
గొప్ప గోవర్ధన గిరి నీగోపఁదెత్తి
పిలుచు చున్నాడు లెమ్మోయి తెలుగుబిడ్డ.

# సుభాస్ బాబునకు సమర్పించిన తెనుగు రవ్వలు

ఎదయై ధేనువు పర్వులెత్తు నపుడే
    యేగిత్తలాఁ బోతు ల
య్యది కన్నెట్టుచు దాని వెంటఁ బడి
    యూరంతన్ బ్రకంపించు మా
ఢ్కా, దిశాంతాళి నియంతలీ జగితికై
    డీకొన్న కాలంబులో
ముదియాఁ బోతుల కంటె ముందు వడిగాఁ
    బోసాగె నీ కోడియే.

లెస్పగ సీమ వేళ్ళు కుదళించెడి సత్తగలట్టి పట్టుచే
బుస్సులు గొట్టు గిత్తయిది; పొంగులు వెట్టెడి వీరరక్తనో
తస్సుల కెల్ల దిక్కయిన తర్జన భర్జన గర్జనాభ్రమై
బస్పనకుండు కైవడి, సెబాసు సుభా సనిపించవచ్చెనే.

ఏ గండు కోయిల రాగ సుధా ఝురి తియ్యని
    యీ చక్కనయ్యఁ గనెనొ
ఏ లతాంతానంద డోలికా శ్రుతి మాత
    పేరిమి నీ బిడ్డఁ బెంచు కొనెనొ
ఏ స్వతంత్ర విచక్షణా స్వరూపిణి వాక్కు
    తఱచుటీ తండ్రికి గఱపు కొనెనో
ఏ రాజ్య రమణీ విహార విశారద లెల్ల యీ
    యనుంగు వరాల నాయని మృదు
పాదములు ముద్దుపెట్టుకో పరుగులెత్తునో;
    మఱే భీకరారణ్య భూమి క్రూర

మృగ నిరంకుశ మత్తేభ బృందములకు
యీ సుభాసంకుశంబయి దూసుకొనెనొ.
ఇఁక బెంగాలట పోతు సింగములకై యెంచన్
మహా జాతి కో
టొకటీ తండటు గట్టి నాడట;
ఘనుడొంక్కండు లేఁడే మొవీ
నికి నీడున్ మన గడ్డపైఁ, గనుకనే
నేఁడాంధ్ర పుత్రుండు వె
ల్తికి వచ్చెన్ గదె; ఆంధ్ర జాతికిఁక
ఖ్యాతిన్ దెచ్చు వాఁడెవ్వడో.

బెంగాలు సింగమై బ్రిటను గుండియలోన
దూసుకొనెడి బాకు బోసుగాదె
బానిసత్వ పరత్వ బంధనమ్ములనెల్ల
కోసివేసెడిదిట్ట బోసు గాదె
బ్రహ్మచర్యముఁ బూని బ్రహ్మాండమును నెత్తు
బాహు బలాఢ్యుడీ బోసు గాదె
భవితవ్యమున మన భారతావనికెల్ల
వాసి వన్నెలు దెచ్చు బోసు గాదె
భరతమాత నోముల పంట పండఁజేయు
ముద్దునగు మోములయ్య యీ బోసు గాదె
రాజకీయ బాధితులకుఁ బ్రాణమిచ్చు
బాస గలవాడు నేఁటికీ బోసు గాదె.

ఎవ్వాని చిఱునవ్వు మువ్వల ధ్వని కెల్ల
కోడె దూడలు పాలు కుడువ మఱచు
ఎవ్వాని సన్నని యిల పాటల కెల్ల
పాడియావులు గుమ్మపాలనిచ్చు

ఎవ్వాని చల్లని యీక్షణమ్ముల కెల్ల
ప్రకృతి కాంత సుకుమారత్వమరయు
ఎవ్వాని చేతిలో నవ్వాయి చువ్వకు
పృథ్వీ తలమ్ము గంపించు చుండు
అతడు భావి భారత జీవితాటవీ మహా
ప్రతాప సింహ కిశోర హార హీర
వజ్రకవచమ్ము కైవడి పరిఢవిల్లు
వాసి వన్నెకెక్కు సుభాసు బోసితండె.

శాస్త్రి, సుబ్రహ్మణ్య వి.వి. (వేదాంతం, వెంకట)
"స్వతంత్ర గర్జన" ఆంధ్ర వాణి ప్రెస్, బెజవాడ.
రాష్ట్రీయ అఖిలేఖాగార్, ప్రతిబద్ధిత సాహిత్యం,
అవాప్తి సంఖ్య-2796, న్యూ ఢిల్లీ.

# 9. పూర్ణ స్వాతంత్ర్యము

## ప్రార్థన

ఉ॥ ఆలును బిడ్డలన్ వదలి యాల గృహంబుల వీడి దుఃఖ దుం
బాలములందగుల్కొనక భక్తిని ఘోర తపంబు సేయుచున్
జైలున నిల్లుఁగట్టుకొని జన్మ వసుంధర దాస్యముక్తికై
కాలముఁబుచ్చు పూజ్యుడగు గాంధి మహాత్ము భజింతు నెమ్మదిన్

ఉ॥ ముప్పది మూడు కోట్ల జనమున్ ధన ధాన్య సమృద్ధియున్ మణుల్
గుప్పలు తిప్పలుంబయిడి కొండలు గల్గి కళా ప్రపంచమై
యొప్పెడి హిందుదేశ మిపుడొయ్యనఁ గూటికి గుడ్డ కేడ్చినే
డుప్పును బత్తి లేకఁబడియున్నది పూర్వపు సోదె చెప్పుచున్

చ॥ నిలువగ నీడలేదు జన నింద్యులకున్ శరణంబు వేడఁగా
వలయును గూడు గుడ్డలకు వచ్చె దరిద్రము పేదలెందఱో
వలవల యేడ్చి యన్నమని ప్రాణములిచ్చె దరిందువారికే
కలిమియు లేదు మా భరత ఖండము సంగతిఁ జెప్పవచ్చునే

శా॥ సీ.యఫ్. ఆండ్రుసు చెప్పినట్టి, మన దుశ్శీలంబు దౌర్భాగ్యముం
ద్రోయం జాలెడు నైకమత్యము సదుద్యోగంబు లేయున్న జా
తీయ ప్రాభవమున్ స్వరాజ్య పదముందీపించు, లేకున్నచో
నీయా వేశము వచ్చునే తిరిగి వేయేడుల్ విచారించినన్

చ॥ చదివిన వారు లేరనుచు సాకులుఁ చెప్పుటకేమి గానియే
చదువులో రాకపోవు తమ జన్మ వసుంథర దాస్య శృంఖలా
స్పద మయి క్షామ దేవతకు స్థావరమై నెలకొన్న కారణం
బిదియని, రూఢిగాఁ తెలిసియే యొనరింపరు ప్రాణభీతులై

ఉ॥ చచ్చినవారు వెండియును జత్తురె! చావననెన్న త్రోవలన్
వచ్చును, కీర్తితోఁజనిన వానిదె చావును జీవనంబు సం
పచ్చయ మాపదన్ విడచి బానిస వృత్తిని దాస్యశృంఖలన్
జచ్చినచో నిరర్థకము చావునకున్ ఫలముండఁగావలెన్.

ఉమర్అలిషా, "ప్రార్థన"; పూర్ణ స్వాతంత్ర్యము (సి.యఫ్. ఆంద్రూసు విరచితము)
అనువాదముః శర్మ, వెంకటరాయ, కోన. రజత ముద్రాక్షరశాల, తెనాలి, 1923
రాష్ట్రీయ అఖిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం;
అవాప్తి సంఖ్య-2793, న్యూ ఢిల్లీ.

# 10. స్వరాజ్య గీతామృతము

## స్తవరాజము

చ॥ యుగ యుగ మందు ధర్మ మిల నూర్జిత పద్ధతి నిల్పి, యుద్ధరిం
పగఁ బ్రభవింతునన్న నిరవ గ్రహుఁడార్యుఁడు, కృష్ణమూర్తి పెం
పెగయగ గర్మయోగియన నిప్పుడు గాంధి మహాత్మునట్లు పు
ట్టుగగనె; నీదు జన్మము కడుంగడు ధన్యము! భారతాంబరో ॥

సీ॥ నాడర్జునుని రీతి నేడల్ల సౌకతా
లిని ధర్మయుద్ధమ్మునను దనర్చె
నాడు యాదవులట్లు నేడల్లరను లస
ద్భక్తి సుధా పానరక్తి దేర్చె
నాడు పాంచాలి జందాన నేడల్ల పాం
చాల మానము కావ శపథమూనె
నాడు దుర్నయులట్లు నేడు నిరంకుశ
ప్రభుతకు సింహస్వప్నంబయయ్యె

గీ॥ హరియెగాదె! గాంధి మహాత్ముడనఘమూర్తి,
నీ తపఃఫల, మెంత వర్ణింప నేర్తు ।
సందియం బేల? శుభము నిశ్చయము నీకు
భారతంబరో! పండె నీ భాగ్యసీమ!

సీ॥ కైరో ప్రభుత్వమ్ము భారతీయులకు "జే
జే హసాద"నునట్లు జేసినాడు
దక్షిణాఫ్రిక ప్రభుత్వ మెమ్మునర్చిన హైంద
వావమానమ్ము దూటాడినాడు
చెంప్రాను తోటలన్ శిరము జూపిన యాంగ్ల,
దౌష్ట్యమ్ము మొదలంట దఱిగినాడు
అహమదాబాదునం దైందవ కార్మిక
కూటానకు జయమ్ము కూర్చినాడు.

సీ॥ మొన్న రాలటు శాసనమున్ కడంక
చెలగి నా మావశిష్టమ్ము జేసినాడు
దివ్య సత్యాగ్రహ వ్రతో దీర్ఘ దీప్తి
నవాహ! నీ పుత్రుడౌ గాంధియలతి వాడె?

చ॥ అమృతపు సోనలుట్టి పడ హాయిగ నేడు స్వరాజ్యగీతి సా
మ్యముగను పాడుచుండె వినుమా! "యొక యేట స్వరాజ్య సిద్ధిసు
మ్మ మలకర ప్రభాంచిత సహాయ నిరాకరణార్క బింబతే
జము ప్రసరించినంత నిది సత్య "మటంచు మహాత్ముడల్లదే॥

సీ॥ చెప్పినంతకు చేసి తీరులె కాని
జవదాటి యెఱుగని సత్యమూర్తి
ధారవోయులెగాని తత్ఫలాపేక్ష సుం
తయు నిచ్చగింపని త్యాగరాజు
భిక్షించులేగాని విడుపేమొ తెలియని
ప్రధిత భీష్మాచార్యవర సుకీర్తి
తవ వలెనే సమస్తమ్ము జూచునె కాని
భువి స్వార్థ మెఱుగని బుద్ధమూర్తి

గీ॥ విశ్వ కల్యాణ మొనరింప విష్ణుమూర్తి
దివ్యతేజో విభాసి గాంధీ మహర్షి
నవని నాచంద్ర తారార్కమలరునట్లు
దీవన లొసంగుమా భారతీమతల్లి ॥

# స్వరాజ్య సందేశము

సీ॥ హిందూ బ్రిటిష్ప్రభుత్వాంధత్వమున ఖిలా
ఫత్తునకైన విపత్తువలన
పరిపాలనా దురంధరుడౌ బ్రిటిష్మంత్రి
త్రొక్కుకర్కశమైన త్రోవ వలన
తీవ్ర దీప్తి మహమ్మదీయ సోదర్య వ
ర్గమ్ము పై బడ్డ కష్టమ్ము వలన
ప్రాణతుల్యమ్మైన ప్రాజ్యతుర్కీ రాజ్య
ధర్మానకగు విఘాతమ్ము వలన

గీ॥ ధర్మ విదులెల్లరును బ్రిటిష్ దుర్మదమ్ము
దగ్గ మొనరింప విద్యుక్త ధర్మమగుట
ప్రభుతకిక సహాయమ్ము నిరాకరింప
నడుము గట్టంగవలయు హైందవ జనమ్ము.

సీ॥ పంజాబు దౌర్గత్య బాధ్యుడెంతయును మై
కేలోడ్వయరుని శిక్షింపరయ్యె
నిరపరాధుల, బ్రజానీకమ్ము ద్రుంచిన
యుద్యోగులకు శిక్ష నొఱుపరయ్యె
ప్రభులు, కామన్సు, దౌర్జన్య మామోదించి
రేకాని జాలి వహింపరయ్యె
మొన్న వైస్రాయియు తనయుపన్యాసమం
దున ననుతాపమున్ జూపడయ్యె

గీ॥ న్యాయ మెందు వెదకిన గన్పట్టదయ్యె
హైందవ మహమ్మదీయ స్నేహమ్ము ప్రబల
భారతీయులారా! బహిష్కార దీక్ష
పూర్ణమగు స్వరాజ్యము నంద బూనరయ్య!

సీ॥ ఘన బిరుదావళుల్ గౌరవోద్యగముల్
నియమిత పదవులున్ విడువవలయు
గౌరవార్థము దొరల్ గావించు విందులున్
దర్బారులున్ విడనాడ వలయు
"బ్రిటిషు కార్ఖానాల" వెలివేసి జాతీయ
విద్యాలయములు స్థాపింపవలయు
న్యాయవాదులు క్రమేణా కోర్టులను మాని
పంచాయితీల నేర్పరుప వలయు
క్రొత్త కౌన్సిల్సుకు గూడ దబ్యర్థులై
నిలువ, నిల్చిన వోట్ల నీయరాదు.

గీ॥ సైనికులును, కూలీల్, గుమస్తాలుగాని
వృత్తికై మెస్పటామియా వెడలరాదు
అన్యదేశ వస్తు ప్రవాహమ్ము నాపి
త్యాగమును జూపవలయు సోదర్యులార!

సీ॥ మూలమూలలబడి బూజెక్కియున్నట్టి
చేతిరాటాల సంగీత గరిమ
ప్రోత్సాహమదినభః పుష్పమ్ముగాగ బె
ల్లడరెడు సాలీల హస్త పటిమ
దేశీయవస్తుల తెగల నిండారు దు
కాణాల బల్ ప్రభాకాండదీప్తి
ఆబాలగోపాల మతిహర్షమున స్వదే
శీయవస్తులవాడు చెలువు మురువు.

గీ॥ త్యాగమే పరమావధిగా గ నలరు
భరతసుతులార । ఇదియె క్రమ్మర గనంగ
భాగ్యమొదవె, గాంధి మహాత్ము ప్రతిభ కలిమి
కై కొనుడు! లెండు!! వడి బహిష్కార దీక్ష.

చ॥ గెలిచినవాడు దానమెది కేరి పరాజితునంద జేసినన్
గెలువగ బద్ధవాని దగు క్షేమము కోసముగాదు, స్వార్థమున్
దలచియెగాని; యిందుల యథార్థ మెఱింగి సమస్త రీతులన్
పెలుచన త్యాగ శీలురయి పేర్మి స్వరాజ్యమునందు హైందవుల్

సీ॥ ప్రథిత "వందేమాతర" ధ్వజమ్మదె ॥ ముందు
మిన్నంది కడు విజృంభించు చుండ
క్రౌర్య విధ్వంసి, జగన్మోహనుడు, గాంధి
సారథియై ప్రౌఢి జాటుచుండ
భారత జన సభా పార్థుడ జేయుడై
పాంచ జన్యమును పూరించుచుండ
ధర్మ సంరక్షణార్థమ్మైన భారత
పుత్రవాహినులు నుప్పొంగుచుండ

గీ॥ బ్రిటీషుదుర్మద కౌరవ్య పటిలినెల్ల
ధర్మయుద్ధమ్మునందు దగ్ధమ్మొనర్ప
వడి స్వరాజ్య రథమ్మదే ॥ బయలుదేరి
వచ్చెడును; రారె! "జే!" యంచుభ్రాతలార!

## అసయోగ శాసనము

సీ॥ ప్రస్తుత పాలకుల్ ప్రజల విశ్వాసంబు
పూర్తిగా నేడు కోల్పోయి యుండ
హైందవుల్ వడి స్వరాజ్యము నిప్పుడే ప్రతి
ష్ఠింప నిశ్చలత భీష్మించి యుంట
జన్మహక్కులు ధ్వంసము జేయు దౌష్ట్యమ్ము
ద్రుంచు పద్ధతులు నిర్ధామమగుట
పంజాబునకు కిలాఫత్తునకును నౌ ప
రాభ వాగ్ని మఱింత రగులు చుంట

గీ॥ ఇండియా ప్రభుత నిక బహిష్కరించి
వలయు చో పన్ను లెగబెట్ట పట్టుబట్టి
సత్వరింబె పూర్ణ స్వరాజ్యంబునంద
దీక్ష వహింపవలె భారతీయులార !

మ॥ మును మున్నాంగ్ల నిరంకుశ ప్రభుత నిర్మూలింపగా బద్ధకం
కణులై తర్కము లెల్లమాని పిదపన్ పై జూచుకోవచ్చుతత్
క్షణమే మీరిక లేచి రావలె గులాంఖానాలబో నాడి హె
చ్చిన కూర్మిన్ భరతాత్మజుల్ జనని రక్షింపంగ ధృత్యోన్నతిన్

శా॥ కా వేషీలను బూని యొుండొరులు నిష్కారంబుగా, నైక మ
త్యా వైశద్యము రూపు మాయగను నన్యాయంబు పాలైయిటే
లా? వైరుధ్యము మీకు మానవలె ధర్మంబెంచి యీ కోర్టులన్
సేవా బంధముడుల్చి మీ జనని రక్షింపంగ నుంకించినన్

ఉ॥ తల్లికి పిల్లకున్ పగలు దార్కొన జేసి ధనమ్ము దోచు నీ
కల్ల వకీలు వృత్తి మనకా! యుచితంబగు జీవయాత్రయే
జెల్లునుగాక జీవములె జెల్లునుగాక తదన్యరీతులన్
తల్లియసంబునిల్ప జనదా? వినరాదె? వకీలు సోదరుల్ !

ఉ॥ హెూరున పారునీ ధనమహెూజ్వల వాహిని హిందూదేశపున్
తీరము మీరకుండ కడు నేరుపుతో నరికట్టి స్వంత వ్యా
పార మపార మై చెలగ భారతదేశ దరిద్రమంత రూ
పారగ జేయగా వలయు నైందవులార! ధృతిప్రమేయులై.

సీ॥ హిందూ ముసల్మానులేకమై యన్యోన్య
రాగ సంపద తులతూగవలయు
వడి బ్రాహ్మణేతర బ్రాహ్మణుల్ పోరాట
మీపాటిజాలించి యెుసగవలయు

అంటరాని తనంబు నవలపోదోయమ
రాధిపుల్ ప్రజలుగడంగ వలయు
ప్రజల విశ్వాస దూరగులైరటన్న
నింద పోలీసు బాపుకొనంగ వలయు

గీ॥ త్యాగులై దొరతనపుటుద్యోగులెల్ల
సాయ మసయోగసిద్ధికి జేయవలయు
త్రికరణముగ నహింసయే దీక్షగాగ
వడిస్వరాజ్యమ్ము స్థాపింప గడగ వలయు
ధీర వరులార ! భారతశూరులార !

చ॥ తరుణమువచ్చె హైందవుల త్యాగబలమ్ము పరీక్షజేయ దు
ర్భరమగు కష్టనష్టములు పైబడుచున్న క్షమ న్స్వరాజ్యమి
త్తఱి నెలకొల్పగా వలెను దారత నెల్లరు దీక్షమై తిల
కస్మరణ స్వరాజపున్నిధికి సాయ పడన్వలె హైందవాత్మజుల్

## దేశ బాంధవ స్వాగతము

సీ॥ పరిపాలనా దురంధర యుగంధర మహా
చతుర విధిజ్ఞ! స్వాగతము నీకు
కార్య దీక్షా వ్రతోత్కర్ష భీష్మాచార్య
ఘన యశస్సాంద్ర! స్వాగతము నీకు
మాతృ పాద ధ్యాన మహిత శివాజీ య
ఖండ సత్కీర్తి! స్వాగతము నీకు
కడునధర్మముపాలి గండరగండ వి
ఖ్యాత ధర్మజ్ఞ! స్వాగతము నీకు

గీ॥ తత సనాతన ధర్మ సంస్థాపనైక
కార్య దీక్షా పటిష్ఠ! స్వాగతము నీకు
ప్రథిత శ్రీ కొండ వేంకటప్పయ సుధీంద్ర !
స్వాగతము దేశబాంధవా ! స్వాగతంబు.

సీ॥ హృదయసీమలను సమ్ముదితాంకురమునాటు
ఘనవనమాలి! స్వాగతము నీకు
ఆంధ్ర మహౌన్నత్య మఖిల దిక్కుల జాటు
కంకణాభరణ! స్వాగతము నీకు
దాస్యబంధ ప్రవిదారణ సుప్రతి
జ్ఞా పరిపాల । స్వాగతము నీకు
ధర్మ సంరక్షణోద్యమ వ్యాపనాచార్య
గాంధి విధేయ । స్వాగతము నీకు

గీ॥ హైందవాంగన గళతార హారమునను
పతకమున నొప్పు నాంధ్ర ప్రపంచమునను
పరగు మణిపూస । వెంకటప్పయ సుధీశ ।
స్వాగతము । దేశబాంధవా । స్వాగతము.

ఉ॥ చీకటు లెల్లడన్ ప్రబలి చిత్తము లెల్ల భయాబ్ధిమున్గి చీ
కాకు పడన్ స్వరాజ్య రవిగ్రక్కున దూరుపుకొండ దోచెడిన్
గాక, దొలంగెడున్ దిమిరకాండపటమ్మన వేగుచుక్క నా
మా కడకేగుదెంచి, తసమాన సుధీవర! స్వాగతంబిదే!

చ॥ బలసి నిరంకుశ ప్రభుత వారిదముల్ జగమంధకార మం
దలమట నొందజేయగ, సహాయనిరాకరణ ప్రగాఢ నో
జ్వలిత సమీరపాటవము పశ్చిమ దిక్కున బారవైచు నం
చలఘు తపోనిధీ । తెలుప నర్మిలి వచ్చితి స్వాగతంబిదే ।

సీ॥ ఒక ప్రక్క దాసు వేఱొక ప్రక్క పాలు మే
ల్వింజా మరల్వాని విసరుచుండ
పృథు కవీంద్రుడు రవీంద్రుండు త్వత్కీర్తి
జగములెల్లడలందు జాటుచుండ
దివ్యవిస్ఫూర్తి గాంధిమహాత్ముండు వి
చిత్రముల్ జూపి రంజింపుచుండ
కడు పారగన్న గంపెడు బిడ్డలును మహా
హ్లాదమ్మునన్ "జయం"బనుచు నుండ

గీ॥ చిన్ని ముద్దుల పట్టి, మాయన్న, కొండ
వేంకటప్పయ పేర్ని నీ యంక పీఠి
నలరుచుండ, నీ భాగ్యమేమనగవచ్చు।
జననిరో! నీకు జయము నిశ్చయమ్ము సుమ్ము!

## రక్తాభిషేకము

సీ॥ మలమల మాడ్చు నుమ్మలికంపుటెండలో
పసికూనలను నిల్వబంచినారు.
గుజ్జాల దోలుపెన్ గొరడాల దయమాలి
ముద్దుకుఱ్ఱల జావ మోదినారు
ఘోరాల కోడి పొన్నూరు బోయినను బ
ట్టించి కందులను బంధించినారు
"ఓర్వ లేమింక మొఱ్ఱో" యన్న వినక ర
క్తాభిషేకము నంది యలరినారు.

గీ॥ శక్తినంతయు జూపి పంజాబు నందు
నిండి యాదొరతనము వా; రింక మీరు
గొడ్డువారు గాక యనుంగుబిడ్డలున్న,
మాన్పరారె! సోదర్యావమాన భరము
పుణ్యగుణులార! భారతపుత్రులార!

సీ॥ "నిదురవో మీపక్క నొదిగిన మగల మీ
రేల? యావలకు బోనిచ్చి" రనుచు
"మీరైకలనుజించి పారవైచి పోలీసు
గమి పరీక్షించు వక్షమ్ము" లనుచు
ముసుగులు బలవంతముగ నూడదీసి "మా
తోరారె! గ్రుమ్మర నూర" ననుచు
"కేలుదోయిని కాళ్ళ క్రిందుగా జొప్పించి
చెవులు పట్టుకొనుండి యువిద" లనుచు

గీ॥ పశుబలము చూపి యవమానపరచినారు
చలము వహియించి దొరలు పంజాబుసతుల;
మాన్పరారె! మీకింతేని మానమున్న,
అక్కసెల్లండ్ర నెవ్వగ నన్నలార!

గీ॥ చేయవలెనంచు నపకృతి జేసి యున్న
సోదరులరక్త మిరుగేల మేదికొన్న
నిండియా దొరతనము వారిచ్చునీవి
కొనగలామె? నెత్తురుకూడు దినగలామె?

# పాంచాల మానభంగము

మ॥ అరెరే! ఆంగలదుస్ససేను డధికారాంధుండునై యల్ల దే!
వర సాధ్వీ తిలకాయమానమగు నా పాంచాల మానంబయో!
చెఱుపన్ గావరె! లేరె మానధనులిస్సీ! యంచుకుయ్యాడగా
తరయన్ రాదె మగంటి మెందణగె? నాహా! తల్లి రక్షింపరే,

మ॥ దురితాత్ముండు సుయోధనోద్వ యరుబల్ తుచ్ఛుండు, పాం
చాల భాస్వర మానంబును భంగపుచ్చి తొడయా స్ఫాలిం
చెడున్ నేడు సోదరులారా! మన పౌరుషంబెచట దగ్ధం
బయ్యె సైరింప దుర్భరమై మించు పరాభవాగ్నినిక చ
ల్లార్పంగ నుంకింపరే!

మ॥ ఖలుడౌ నా డయరాసురుండదియె! సత్కారంబు గైకొంచు నె
ట్టుల ప్రేలెండునొ దుర్మదాంధుడయి నేడున్గూడ; పంజాబు బి
డ్డల సర్వంబును మున్ను మ్రింగునదికట్టా! యింతయున్ జాలకన్
తరమౌనే భరియింప నిప్పుడయినన్ దౌష్ట్యమ్ము పోకార్చరే!

మ॥ అవురౌరా! ధనమెల్ల దోచినను మాఱాడంగ లేదింతయున్
పవరంబుల్ పటు కాటకంబుల నిజ ప్రాణాలుపో లక్ష్యమం
టె? విలోకింపమె? గడ్డిపోచవలె గానీ మానసం బేర్చు నీ
యవమానంబు సహింపనౌనె ధృతి లేదా పూనరాదొక్కొ హైం
దవులారా! అసయోగ దీక్ష నిపుడైనన్ వే-యహింసోద్ధతిన్.

# ఆదేశము

సీ॥ కరములు ఫాలభాగమున జేర్చి తపించు
కన్న తల్లిని మీరు గావరేల?
చినుగు గుడ్డలు గట్టి జీర్ణించి శల్యమౌ
తల్లి దుస్థితి నింత తలప రేల?
తన పుత్రుల పదంబు వినియశ్రుల నింప
పుత్రశోకము బాపబూనరేల?
దొరలు తనకు జేయు దుర్ణయంబుల బాపి
జనని రుణమును దీర్చరది యేల?

గీ॥ మాతృభక్తి యె యెక్కుడో భ్రాతృలార!
దేశ సంకటమును బాప నాశయున్న
గాంధి చెప్పిన చందాన గ్రాలరయ్య
తివిరి మాతృశృంఖముల ద్రెంపరయ్య!

సీ॥ భారతాంబయె మీకు పాలిచ్చి పెంచిన
తల్లి యంచును మీరు దలతురేని
ఆలుబిడ్డల యందు నభిమానమును మాట
హృదయాబ్జమున మీకు నెసగె నేని
తల లెత్తి మీకింక ధర పైని యశముతో
గాలంబుగడుపంగ గాంక్షయేని
అతి స్వచ్ఛమైన భారత రక్త మొరల ప్ర
వాహంబు రీతిని పారునేని

గీ॥ కన్నతల్లిని సిగబట్టి కలతబెట్ట
సిగ్గులేదె చూచుటకు! దేశీయులార ।
భరత భాస్కరుడ పరాబ్ధి బడకమున్నె
తెలివి గని తిమిరమును ఛేదించరయ్య!

ఉ॥ హైందవ వీరులార కడు హైన్య పదంబుల గ్రుక్క గోరి మీ
కుందగు నే యశోరమను కొల్లగనమ్మగ పండు గంచు? సే
వాంధత నన్యుతో మధురస్నానములందిను కంటె స్వేచ్ఛమై
కందఫలంబులందినుచు కానలకేగ శుభంబుగా దోకో!

## అభాగ్య పిశాచము

సీ॥ పశ్చిమదేశముల్ పటుతరాజ్ఞాన గా
డాంధకారమున కొట్లాడు నాడు
పాశ్చాత్యులతి ఘోర వనవాటముల దిగం
బరులై మృగములట్లు దిరుగునాడు
అభినవ నాగర కాష్ఠసీమల్ మహా
రణ్యమ్ములై యలరారు నాడు
పృథు కళాశూన్యమై శ్వేత ప్రపంచక
మూరుబేరును లేక యున్నవాడు

గీ॥ ఘన హిమాలయ పర్వతాగ్రమున నిలిచి
కరుణ యావత్ప్రపంచంబు నరయు నీకు
కడ కభాగ్య పిశాచి సోకుడు న నేడు
కటకటా! ఎట్టి గతి పట్టె! కల్పవల్లి!

సీ॥ కట్ట గుడ్డయు తినగా తిండియును లేక
కలత నొందుట కేది కారణంబొ?
తరియింపదగిన సాధనమైన సద్భక్తి
కానబట్టుట కేది కారణంబొ?
అరిభీకరంబైన యతుల ధైర్యంబు పో
కార్చి వైచుట కేది కారణంబొ?
ఆగతా నాగతంబరయు విజ్ఞానంబు
బీరువోవుట కేది కారణంబొ?

గీ॥ అట్టి పరకీయ నాగర కాసురుండె
తనివి తీరక రుధిరంబు త్రాగి త్రాగి
రత్నగర్భను శల్యగర్భగ నొనర్చె;
తివిరి తెకటార్పరే! భారతీయులారా!

సీ॥ తలచూపకుండ స్వాతంత్ర్యభావముల జం
పిన పిశాచం బాంగ్ల విద్యకాదె?
చెలువారకుండ దేశీయవృత్తులను మా
పిన వేఱుపురువాంగ్ల విద్యకాదె?
అరివీరులకు గుండెలదరించు ప్రభనొంచి
భీరు జేశిన దాంగ్ల విద్యకాదె?
పృథుల స్వయం నియంతృత్వశక్తి నడంచి
విషబుద్ధి నిడె నాంగ్ల విద్యకాదె?

గీ॥ పెఱికె దేశీయతను నాంగ్లవిద్యకాదె?
పెంచె బానిసలుగ నాంగ్ల విద్యకాదె?
చాలు నికనైన తనియరే! మేలుకొనరె!
ఆత్మధర్మము నిల్పరే । ఆంధ్రులార!

సీ॥ అధిక జనాభి మతాచార మెడప మా
తృ ద్రోహమే దక్క వృద్ధి లేదు
మనమింత వఱకు బొందిన కష్టముల కంటె
నధిక కష్టములింక నవని లేవు
పడరాని కష్టముల పడిగడించిన ఆత్మ
శక్తి నింధనము పాల్పలుపరాదు
"నిలుచు మార్గమ్ముగాన్పింపదే" యను వృథా
రాట మింకి ప్పాట బాటి కాదు.

గీ|| మనుజునకు కష్టములు రాక మ్రాకునకును
వచ్చునే? యింత మాత్రాన భయ మదేల?
కులయశమ్ములే మొదలంట గూలుచుండె!
లేవరే! మీకు మగటిమి లేదె? అకట
దళిత ధృతులార! ఆంధ్ర సోదర్యులార!

సీ|| పొడగానరే! లేచి పడెడు పంజాబు సో
దర్య బృందంపు రక్తం పుటలలు
మై సోకదే! ముసల్మాను సోదరమత
ప్రతిభ గాల్చు మహా పరాభ వాగ్ని
వినరాదె! గర్భ నిర్భేదమై వలస రా
జ్యముల గుండెడు సోదరార్తరవము.
తెలియరారే! పశుబలమె నేడును బూని
ప్రబలెడు నిండియా ప్రభుత మదము

గీ|| తోచలేదె! విదేశజుల్ దోచుచుంట
సిగ్గుగాదె! బానిసలై కృశించుచుంట
కటకటా! యెందు మీ యాత్మ పటిమ డాగె?
తరుమరే! అభాగ్య పిశాచి సోదర్యులార!

సీ|| అడుగంటెనే? స్వరాజ్యము ప్రతిష్ఠించిన
ఘన శివాజీ నాటి కార్యదీక్ష
మ్రగ్గనే? కంపెనీ మదమడంచిన హైద
రాలి సాహెబు మనోనంద దీప్తి
చెదరెనే? వైరి నొంచిన మహా టిప్పు సు
ల్తాను నాటి యఖండ ధైర్య పటిమ
పారదేమీ శరీరా రామసీమ నా
నా సాహెబు మనః ప్రణాదశక్తి

గీ॥ చెడనె? జాన్సి మహాలక్ష్మి శీల మహిమ
లేశమేని మగంటిమి లేదె మీకు!
బెదరకీయభాగ్య పిశాచి నదమరయ్య!
శూరవరులార! భారత సూనులార!

మ॥ చలపాదించి యధర్మ రాక్షసి మహార్ఘుంకార హుంకారముల్
సెలగన్ శేష పురక్తబిందువును బీల్చెన్ గ్రొవ్వి; సందేహమై
బొలిచెన్ దేహమె నిల్చునో నిలువదేమో? జీవుడున్నప్పుడే
తిలకింపన్ గడసారి; అమ్మ మిముబ్రీతిన్ బిల్చిడున్ రారొకో.

ఉ॥ భారత మాత నొంచెడు నభాగ్య పిశాచము బారద్రోలి యిం
పార స్వరాజ్య వైభవము నందగ కంకణ ధారులై, మహా
ధీర వరేణ్యులన్నలుకు తెల్లము జేయరె । పేరు నిల్పరే ।
భారత పుత్రులార! కడుపారగ గాంచిన తల్లిగావరే!

సీ॥ సీతామహాలక్ష్మి శీలంబు జెఱుప య
త్నింప రావణుడు నశింపలేదె?
పదరి ద్రౌపది మానభంగం బొనర్ప బో
కౌరవా న్వయము దగ్ధంబు కాదె?
దమయంతి నల యరణ్యమున బట్టుకొనంగ
బోయి కిరాతుండు బుగ్గికాడె?
అల శచీదేవి పొందాశించి నహుషుండు
జగతి స్వరూప నాశనము గనడె?

గీ॥ ఎవడు పరకాంతల గలంచి వృద్ధి పొందె?
భారతాంబరొ । సందేహ పడనదేల?
నేడు నీ పుత్రికల గడున్వేతల నిడిన
యసుర సామ్రాజ్య దౌర్మార్గ్య మణిగిపోదె?

ఉ॥ నాడుకదా మహోత్సవము నాడుకదా విజయ ప్రమోదముల్
నాడుకదా నిరత్యయ విలాసమునన్ దులదూగు భాగ్యమా
నాడుకదా లభించును మనంబున కెంతయు హాయి, యింక నే
నాడు స్వరాజ్య మైందవ జనప్రకరమ్ము గడించి మించునో.

## అసహయోగ పాశుపతము

ఉ॥ ఔరా! చనుదెంచె కాచు కొనుమందు కృతఘ్నత యున్నతఘ్నులున్
యదియును తప్ప దింతయును సత్యము! గాంధి మహాత్మ పార్థ సా
రథి! విజయాఖ్య కాంగ్రెసు, దొరం కొనియేసినవాడు యేసియు
స్పర్ధ యసహయోగ పాశుపత మాంగ్ల ప్రభుత్వ నిరంకుశత్వమా!

చ॥ పడిన సయోగ పాశుపతవహ్నిభుగాయితమై యజాండమె
ల్లెడ నిబిడీకృతంబయి రహించెడు; నీర్శ్యదురాశ మోసముల్
పొడ వడిగెన్ మఱింక జెడుపోకడ లియెడ సాగిరావు నీ
కడుగిడ చోటు లేదిచట నాంగ్ల ప్రభుత్వ నిరంకుశత్వమా!

తే॥ ఏ మహోద్దీపమిక నారు నెలలలోనె
సమసెడు! వినాశ కాల మాసన్నమయ్యె
చేసికొను మింక నీవేమి చేయగలవొ
కుటిల ధూర్త నిరంకుశోత్కట పిశాచి!

చ॥ సలలిత భారతంబయె ప్రచండ మహత్వ పటుత్వ తత్వసం
కలిత మయేని, గాంధియె, జగత్త్రయమందు మహాత్ముడేని భూ
స్థలి నసయోగ పాశుపత సాత్విక దివ్యశరంబమోఘమే
నలఘు నిరంకుశారి నెలలారిట భస్మముగాక పోవునే!

# భరత వాక్యము

ఉ॥ మానమె పెన్నిధానమని మానస సీమదలంచి యొక్కచో
ప్రాణమునైన కాన్కనిడి ప్రాభవమైన స్వతంత్ర వృత్త మెం
తేనిలుపంగలట్టి యతిధీరత భారతమాత నిత్యక
ల్యాణము పచ్చతోరణము నైయలరారెడుగాకనిమ్మొయిన్.

సీతారామాంజనేయులు, వడ్డాది; శాస్త్రి, కాశి విశ్వనాథ, పూడిపెద్ది.
"స్వరాజ్య గీతామృతము"-వి.యన్. ప్రెస్, రాజమండ్రి,
పందిరి మల్లికార్జున రావు, రాజమండ్రి 1921-23,
రాష్ట్రీయ అభిలేఖాగార్, ప్రతిబంధిత సాహిత్యం,
అవాప్తి సంఖ్య-2777,
న్యూ ఢిల్లీ.

# 11. గాంధి మహాత్మ

## (అను కలియుగ ప్రహ్లాద)

తే॥గీ॥ బ్రాహ్మణ కులంబున పరశురాముడగుచు
క్షత్రియ కులాన శ్రీరామచంద్రుడగుచు
నాలవ కులాన రుక్మిణీలోలుడగుచు
కొరత దీర్పంగ వైశ్యుల కులమునందు
జననమొందిన గాంధిదేవుని పదాబ్జ
ముల సమర్పింతు నీ గ్రంథమిల వెలుంగ ॥

సీ॥ దక్షిణాఫ్రిక యందు తన సోదరుల గావఁ
బడరాని యిక్కట్లు బడినవాడు
తెల్లవారలు బెట్టు తిప్పలన్నిటి కోర్చి
సత్యాగ్రహము బూను సత్యశాలి
ఎల్ల ప్రాణులకు నెంతేని యాపద
నోపజాలని యహింసా పరుండు
బాధలెంతలు గల్గఁ బ్రాణమే పోయిన
హరి భక్తి విడువని పరమ మౌని

తే॥గీ॥ నరులకైనను ఘన నిశాచరులకైన
యలవిగానట్టి ప్రహ్లాదుఁడనగ వెలయు
ఘనుడు కలియుగ ప్రహ్లాద గాంధి చరిత
వినుడు జనులార వీనుల విందు మీకు ॥

సీ॥ బ్రాహ్మణోత్తములలో బ్రాహ్మణోత్తముడైన
వేద వేదాంగాది వేత్తయెవడు
ఋషి సత్తములలోన ఋషి సత్తముండైన
పూత చరిత్రుడౌ పుణ్యుడెవడు

పరమ భక్తులలోన పరమభక్తుండైన
ప్రహ్లాద తుల్యుడౌ పరముడెవడు
అవతార పురుషులంద వతార పురుషుడై
దివ్య స్వరూపుడౌ దేవుడెవడు

తే॥గీ॥ ఇందుగల డందులేడను ఏమి లేక
అన్నిట ప్రవీణుడై కీర్తి గొన్నవాడు
కృష్ణ భగవానుడే జన్మమెత్తినట్టి
కల్కిదేవుండు మనపాల గాంధిమూర్తి ॥

## గాంధి మహాత్మ

ఉ॥ ఎవ్వని శాంతిమూర్తియని యెల్లర నారతమున్ భజింతురో
యెవ్వడధర్మమార్గమున నించుకయేనియుఁగాలు పెట్టడో
యెవ్వడు లోకమంతట నహింసయె యుత్తమ మంచు జాటెనో
యవ్వరమూర్తి గాంధిఋషి కంజలి మోడ్చి నమస్కరించెదన్ ॥

ఉ॥ కత్తులు లేవు శూలమును గాండివమున్ మొదలే హుళక్కి, నో
రెత్తి ప్రచండ వాక్పటి మనేనియు జాటడు, వైరిమీద దం
డెత్తగ సేన లేదు, బలహీనము కాయము కోప తాపముల్
బొత్తుగ సున్న, అట్టి ఘనమూర్తి మనోబల శాలి గాంధిఁ జే
యెత్తి నమస్కరించి స్మరించెదనెప్డు స్వరాజ్య సిద్ధికిన్ ॥

## బాలగంగాధర తిలక్

మ॥ మహారాష్ట్రంబున సింగమో యనగ జన్మంబెత్తి రారాజు మిం
చు హెూయల్ గల్గి స్వదేశ మాతబడు సంక్షోపంబు మాన్పంగ బల్
మహిమ ప్రజ్ఞలతో జనించిన తిలక్ మాన్యుండు గంగాధరున్
సహజంబైన ప్రతాపమూర్తిని సదా స్వాంతంబులో నిల్పెదన్ ॥

ఉ॥ ఎవ్వని నామ మాంగ్లజనులెల్లరు "బూచి" విధానవెంతురో
యెవ్వని లోక మాన్యుండని యెల్ల జనంబులు బూజ సేతురో
యెవ్వని రక్తంమందు ప్రవహించునొ ధీరశివాజి తేజ మిం
కెవ్వడు చక్రవర్తి యయి యెల్లజగంబుల నేల జాలునో
యవ్వర మూర్తి శ్రీ తిలకు నంజలి మోడ్చినమస్కరించెదన్ ॥

## భరతమాత

సీ॥ శ్రీరామ కృష్ణావతార పూర్ణుల గాంచి
పావనం బైనదీ భరతమాత
పాంచాల వీరులౌ పంచ పాండవులచే
వాసి గాంచినది యీ భరతమాత
సావిత్రి, సీత, పాంచాలి మున్నగు పతి
వ్రతలచే ఘనమైన భరతమాత
గంగా ప్రవాహాది ఘన నదీస్నాన సం
పదచే పవిత్రమౌ భరతమాత

తే॥గీ॥ ముప్పదియు మూడుకోట్లకు పుట్టినిల్లు
సకల ప్రజల కిరువైన శౌర్యమాత
పాడిపంటల దులదూగు భాగ్యశాలి
పరమపావని మనభూమి భరతమాత ॥

# భరతమాత

## (ఇంగ్లీషు పరిపాలనము క్రింద)

సీ॥ సకల సంపదలు నాశనమై తుదకు సీమ
గుడ్డనే డబ్బిచ్చి కొనగ వలసె
మనము పుట్టిన భూమి మనము దున్ను కొనంగ
పరరాజు నాజ్ఞను బడియ వలసె
మనకొండ గుట్టలు మన బీళ్ళు నడవులు
ధనమిచ్చి కొని వాడు కొనగవలసె
దేవుడిచ్చిన నోరు తెరచి మాట్లాడంగ
ప్రభువు శిక్షకు భయపడగ వలసె.

తే॥గీ॥ ఉప్పునకు గూడ పన్నిచ్చు చుండ వలసె
గుండు సూదులు, "పెన్సిళ్ళు" గూడ నితర
దేశముల నుండి తెప్పించి తీరవలసె;
కటకటా దేశ దౌర్భాగ్య మిటులనుండె ॥

"పుండరీకాక్షుడు, దామరాజు, గాంధి మహాత్మ"
అను కలియుగ ప్రహ్లాద హరికథ,
చంద్రికా ముద్రాక్షర శాల, గుంటూరు.
రాష్ట్రీయ అఖిలేఖాగార్, అవాప్తి సంఖ్య-2792,
ప్రతిబంధిత సాహిత్యం,
న్యూ ఢిల్లీ.

# 12. మహాత్మా గాంధి

## (నాంది)

మ॥ యమిలోకాత్త మహా మహత్వ కలితుం । డై ధర్మ సంస్థాన । నా
ర్థము మర్త్యంబునఁ బుట్టి సర్వ సమతం । దళ్కొత్తి సత్యాగ్రహా
స్త్రి ము హస్తంబున బ్రస్తుతింబడయ దే । శ ద్రోహముందూల్చ ని
ర్మ మతం బొల్చినమాన్యుఁడా పరశురా । మ స్వామి మిమ్మేలుతన్.

సీ॥ ఎవని నామాక్షర । ప్రవచన మెందును,
బంచాక్షరీ మంత్ర । పఠనమయ్యె
నెవని యాడిన మాట । యెల్ల చోటుల మేటి,
రాజశాసన మయి । ర్గాలనయ్యె
నెవని సిద్ధాంత మైం । దవజాతి కెల్ల నా,
చరణీయ వరధర్మ । శాస్త్రిమయ్యె
నెవని సద్వర్తనం । బెల్ల నల్లన మౌని,
తల్లజులకు గురు । త్వమునకయ్యె

తే॥గీ॥ నెవని హృదయంబు నిష్కలం । కేందు మంద
లామృతాయితమై సత్య । భూమియయ్యె
నట్టి గాంధిమహాత్ముది । వ్యావతార
మంతయును నాటకంబాడ । నాజ్ఞఁగొంటి.

క॥ సత్యాగ్రహ నిగ్రహామే
నిత్యవ్రతముగను బూని । నిఖిల ధరిత్రిన్
సత్యమ శ్రేయం బనుచున్
బ్రత్యక్షము సేయు దివ్య । భావుని వినవే?

సీ॥ పోర్బందరు పురీశు । పొందఁ బ్రగ్గడయయి,
యొప్పఁడే నీతాత । యుటము చందు
కతియ వారాదిగాఁ । గడుచోటుల దివాను,
గా నుండె నీ తండ్రి । కరము చందు
నిళ్ళాన కేడేడు । నాళ్ళైన బస్తుండి,
నోమె నీతల్లి స । తీమ తల్లి
దేశ బంధులు జగ । దీశాత్త చిత్తులు,
ఘనులు నీ యన్నలు వినుతయశులు

తే॥ ఇట్టి పేర్మికి నెలవయి । యెసక మెసఁగు
నార్య వంశంబునం బుట్టి । ధైర్య సాహ
సాది గుణ భూషితుండవై । యమలమూర్తి
వైననీ వన సామాన్య । మానవుఁడవొ.

## భారతీయుల కర్తవ్యము

(మహాత్మ ప్రబోధము)

సీ॥ వీడు నీచుఁడు నేను । విఖ్యాత కులజుండ,
నను భేదభావము । నందవలదు
నేను శాల్యన్నమే కాని భుజింపను,
ధనినని గరువంబు । దవుల వలదు
శత్రు వేనియుఁదన । చక్కికి రావాని,
యపరాధ మెంచుచు । నాడవలదు
ప్రాణ సంకటమైనఁ । బనులు పడినఁగాని,
కలనైన ననృతంబు । పలుక వలదు

తే॥ చెడ్డకార్యము లెప్పుడు । జేయవలదు
పరుల కూడిగ మొనరించి । బతుక వలదు
మాతృ గౌరవ మెప్పుడు । మఱవ వలదు
భరతమాతకుఁ బుట్టిన । ప్రతిజనుండు.

మ॥ మన వర్షంబిది దేవవర్ష మననై । మన్నింపనై మ్రొక్క నై
చను నందుండిన వారు దేవతలనన్ । సత్కీర్తికిం బాత్రు లై
మన మందీశ్వర భక్తి గల్గి మునులై । మా నొందుచున్నారు మీ
రును దానిన్ మఱకీశ్వరుం గొలవఁజేరు । మీకు నైశ్వర్యముల్.

## గాంధి గీతము

(రౌలట్టు చట్టము)

తే॥ ఇట్టి విధి నగు రౌలట్టు । చట్టములను
గూర్చి చర్చించుచును నేను । గొన్ని రేలు
నిద్ర లేకుండఁగడపితి । నృపతులకును
బోడము నిబ్బంది లెవ్వియో । యెడఁద నెఱిగి
కొంట కెంతో ప్రయత్నించి । యుంటిఁ గాని
చట్టముల న్యాయమును గానఁ । జాలనైతి
వెలయు రౌలటు సంఘుని । వేదికయును
బట్టి చదివితిని దదభి । ప్రాయమునకు
నా మభిప్రాయము విరుద్ధ । మై యెసంగెఁ
గలరు లేరన దౌర్జన్య । కారులిలను
వారు సంఘమున కుపద్ర । వకరు లరయ
మీరు చేసిన చట్టముల్ । వారి మాత్ర
శిక్ష చేయుటకే గాక । క్షితిపయి నగు
నెల్ల సంఘము శిక్షింప । నేఱు పడును
దొరల పక్షము వారికి । దుష్టశాస

నమ్ములు విపరీతాధికా । రమ్ము నిచ్చు
నవి యుపద్రవకారుల । కధిక తరము
లయి మహోపద్రవ మొనర్చు । నఖిల జగతి
కిపుడు సంస్కరణములవి । యిచ్చిరేని
యీయకుండిర యేని యీ । మాయశాస
నములు సామ్రాజ్యమునఁగల । హములు వెంచుఁ
గాన నివి జేయగాడని । వాను ద్రోహి
సమితి నాఁ గుటకున్న చ । ట్టము లె చాలుఁ
బాలనా వర్గమందివి । చాలాకాల
ముగను జీర్ణించి యుండిన । భూరి రోగ
లక్షణంబులుగా నయి । లావుపుచ్చు
దాన నావేశ పూరితు । లైన యట్టి
దష్ట జనులు రహస్య మం । దునను దుష్ట
కార్యములు సేయనెంతురు । కాని మాన
రందునన్ రాష్ట్రమున విప్ల । వాధికమ్ము
గలుగు సత్యాగ్రహ వ్రత । కలితులైన
వారు శ్రమ కోర్చియున్ ప్రభు । త్వము నెదుర్చ
మనుచు శపథంబు చేయుదు । రదియుఁ గాక
దౌష్ట్యమే న్యాయమను వారి । దవుల దరిమి
తమరు సత్యాగ్రహమె సాధ । న మని తవిలి
చెప్పుచున్నారు వారల । చేష్టితముల
సంశయింప నింతయు నవ । సరము లేదు
వారికి కితరౌషధము లేమి । వ్యాధి మాన్ప
కుంట సత్యాగ్రహౌషధ । మొండు వ్రతము
గాఁగ సేవించు చున్నారు । బాగుపడెడు
నిచ్చనే గాంధి మీవాఁడ । నిట్టు విన్న
వించు చుంటిని నా మాట । వినుఁడు మీరు.

క|| స్వాగతము దేశహితునకు
స్వాగతము సమస్తలోక । శస్త్రాఖ్యునకున్
స్వాగతము మహాత్మునకున్
స్వాగతము పరోపకార । పరిపూర్ణునకున్

శా|| స్వార్థత్యాగము చేసి దేశహితమున్ । స్వాంతంబునందెంచి ప్ర
త్యర్థుల్ ప్రస్తుతి సేయు మార్గమునఁగా । ర్యంబుల్ ప్రవర్తింప ని
ష్టార్థంబుల్ సమకూర్పఁజాలిన । మహా సత్యాగ్రహాదర్శ మా
త్మార్థంబౌనని చూపు మోహనుని మే । మర్థింతు మశ్రాంతమున్.

విజయ వృత్తము :

జయ జయ గాంధి మహాత్మా । జయ సత్య గుణాత్మా!
జయ జయ మోహన నామా । జయ సద్గుణ ధామా!
జయ జయ లోక హితార్థీ । జయ సర్వజనార్థీ!
జయ జయ పుణ్య చరిత్రా । జయ సన్నుతిపాత్రా!

## పంజాబు ఉదంతము

(జలియన్‌వాలా బాగు ఉదంతము-డయ్యరు ఘోరకృత్యము)

చ|| పుడమిని శాంత మెంతయును । బొంపిరి వోవుచునున్న వేళ నా
యొడయరు రాక్షసుండొకరుఁ । డొయ్యన వచ్చి కుశాసనంబులన్
బొడముఁగఁజేసి భారతుల । పూర్వపు హక్కుల నుక్కడంచుచునన్
గడు నిడుమల్ ధరాస్థలికి । గల్గన జేయఁగ నయ్యె నయ్యయో.

తరళము|| నిరపరాధులఁ బట్టిరయ్యది । నీచ మందము మందులై
జరపి రందము నోరు లేని ప్ర । జా సమూహము నీహ లే
కరయకిట్టులు ప్రేల్చుటెక్కడి । యాసురుంబొ తలంపఁగన్
నరులు చేసెడు నట్టి చేఁతల । నంగలాఁడెవఁడుండునో.

క॥ ఎదురించి మాటలాడెడు
సదయాత్ముల నెల్లఁబట్టి । చర్చింపక దు
ర్మదుఁడైన యొడయ రాసురుఁ
డదనున భక్షింప కుండఁ । దకటా తలపన్.

సీ॥ అయ్యవసరమున । దయ్యరు సేనాని,
వచ్చి రాంబాగులో । నిచ్చు నుండె
వచ్చిన దాదిగా ।వరుసతో నాంక్షలు,
ప్రబలె నమృతసరః । పట్టణమున
సంవత్సరాదివై । శాఖి పర్వముఁజూడఁ,
జేరిరిప్రజ లూరి । యూరి నుండి
యపుడు కన్యాలాలు । నాధిపత్యంబున,
ఫగు సభయని పుర । మందు ప్రోసె

తే॥ అచట జలియను వాలబా । గ నెడుచోటి
కరిగి రిరువది వేలకు । నైన జనము
సభను జూచు తలంపున । నభయులగుచు
వేది పైకెక్కి హంసరా । జేదొ చెప్పె.

తే॥ నరులపైపయి నొక విమా । నంబు నింగి
నాడు చుండె సైన్యములతో । నా డయరట
కరుగు దెంచి కాంచెను సభ । యందు శిశువు
లాంగ్రడు ముదుసళ్ళు నుండి ర । న్యేన్య మొఱసి.

చ॥ డయరు పిరంగి బండ్ల బ్రక । టంబుగ గైకొని వచ్చి మూఁకలన్
బ్రియమునఁ గాల్ప నాజ్ఞయిడె । రేఁగిన సైనికు లొక్క పెట్టునన్
బయిఁబడి యగ్ని వర్షమున । వారి గ బాఱఁగఁజేసిరందునన్
రయమునఁ ద్రెళ్ళి రెల్లెడ బ । రంపరలై కయిసేసి కాశ్యపిన్.

# దండకము

అయ్యయ్యో । యే మందు నాగుళ్ళ వర్షంబునన్
బాలురున్ వృద్ధులున్ జవ్వనుల్ స్త్రీలునుం బూరుషుల్ గుప్పలై
తిప్పలై కూలి ర వ్వేళ రక్తంబు సువ్యక్తమై పాఱె లాలాజలం
బెల్లడన్ నిండెఁగల్లోల ముల్లోక ముందాఁకె లోకంబు చీఁకా
కునంౘుంగె నందందుగా దెందు నుం డుండెముల్ మొండెముల్
గాళ్ళునుం చేతులున్ డొక్కలుం బిక్కలున్ ముక్కలై చెక్కలై చిక్కనై
దిక్కునున్ మొక్కునున్ లేని వై గాన నయ్యేన్ భయం
బైన యబ్బాగులో వాఁగులో జాలునాఁౙోగులై చచ్చియున్
నొచ్చియున్ జిచ్చమై హెచ్చియున్ దప్పి మై నార్చియున్ జొప్పి పోఁ
గూర్చియున్ దారిలే కేడ్చియున్ డాగియున్ మూగియున్ లోగి
యున్ వీగియునన్ ౙాకియున్ డోకియున్ బండియున్ బిండియై
యుండియున్ గొందఱుం గొందఱో రామ । యో కృష్ణ । యో దీ
న బంధూ । భరింపంగలే మోమ రావేమిరా? జాలిలేదేమిరా?
రామ రామా । మొఱాలింపరా! శంకరా! యంచునుం గొంద
ఱో తల్లి । యో తంౘడి । రండయ్య యో బిడ్డ । యెందుంటివో యన్న ।
నా కన్న ముందేగి తో కాంత! లోకాంతరం బేగి యేకాంతమా
డంగఁగూడంగ రమ్మందువే? యంచునుం గొందఱేఁజచ్చితిన్
ౘచ్చె గోళంబు నా పాలనై యంచు హా । యంచు నా పీన్గులం
బీనుగై పోవు వారునన్, శిరంబుల్ కరంబుల్, గనుల్, గాళ్ళునుం
బోవ వాపోవు వారున్ మహాసంకులంబందు బాదాహతిన్ నేలపైఁ
గూలుచున్ ౘందువారున్ మనుష్యాదులన్ వారినోనాడు వారున్
ౘభుత్వంబు నుం దూరు వారున్ ౘజాళిం ౘతీక్షించు వారున్
బరం బారయం బాడియం చూఱకే చూచువారున్ వెలార్పంగ
లేకున్న వారై పురీవాసు లా కల్పకాలాగ్ని సంక్షుబ్ధులై స్థబ్ధులై

పోయి రాడయ్యె రామాత్ర హర్షింప కాత్రంబునం బొంచి మా
ర్షల్ ప్రయోగించి మానంబు భంగించి కోటేశులం గొట్టునం బెట్టి
లాయర్లనుం బట్టి, కొట్టించి తిట్టించి ప్రాఁకించి, దేకించి, మ్రొక్కిం
చి, నొక్కించి స్రుక్కించి దక్కించి సన్నీల నొక్కించి, మన్నీ
దక్కించి ముక్కోణ ముంగట్టి ముక్కాకలం బెట్టి, ష్ముక్కాల ముం
గొట్టి నేరంబులన్ మోపి, కారాధులం దోపి, దోసంబులన్ జూపి
దేశంబులన్ బాపి, నానా ప్రకారంబులన్ నాశముం జేసినాడ
య్యె రొడ్వైరు సాహాయ్యముం గాంచి చుట్టంబు వైస్రా
యి రౌలట్టు చట్టంబు లీరీతి భూతంబులై భూత సంఘ ప్రభూతాతి భీతా
వహా కాండ కల్పంబులై యుండె నో దేవ । నీ దివ్య చిత్తంబునన్ దీనికిన్
శాంతి నీక్షించి లోకంబు రక్షింపవే లోకబంధూ ।
కృపా పూర్ణ సింధూ । నమస్తే నమస్తే నమః

## లోకమాన్య బాలగంగాధర తిలక్

సీ॥ చలి చీమనేనియుఁ । జంపఁ ద్రొక్కని వ్రతంబు,
పుట్టుతోడన నేర్చి । నట్టివాఁడు
అన్నదమ్ములు వోలె । నఖిల జనంబుల,
ననురాగమునఁ జూచు । నట్టివాఁడు
దూషణ భూషణా । దులతగు లంబున,
కందని మదిగల । యట్టివాఁడు
తన కెంత లాపదల్ । తారసించినఁగాని,
పట్టును విడువని । యట్టివాఁడు

అ॥ అనృత మన్న నెఱుఁగ। నట్టి మహాత్ముఁడు
లోకమాన్యుఁడఖిల। లోక సుతుఁడు
మాతృదేశమునకు। మానంబు।ప్రాణంబు
ధారవోసినట్టి। ధన్యుఁ డతడు.

శాస్త్రి, కృష్ణమూర్తి, శ్రీ పాద (కవిరాజ) "శ్రీ గాంధి విజయధ్వజ నాటకము"
విద్యాలయ ప్రింటింగు వర్క్సు, రాజమండ్రి (రాజమహేంద్రవరము), 1921-6
రాష్ట్రీయ అభిలేఖాగార్, అవాప్తి సంఖ్య-2785,
ప్రతిబంధిత సాహిత్యం, న్యూ ఢిల్లీ.